ఈనాడు అమరావతి
కృష్ణా
గురువారం అక్టోబరు 17, 2024

పవనన్నే రోడ్లు అభివృద్ధి చేస్తారు

స్థాయీ సంఘాల సమావేశంలో జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక ఆసక్తికర వ్యాఖ్యలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

★ ప్రజాప్రతినిధులుగా గెలిచామన్న మాటే కానీ మా పరిధిలో ఏమీ అభివృద్ధి చేయలేకపోతున్నాం.

-ఇదీ జడ్పీ ఛైర్‌పర్సన్ వద్ద కొందరు జడ్పీటీసీ సభ్యుల ఆవేదన..

★ 'డోలు వచ్చి మద్దెలకు మొరపెట్టుకున్నట్లుగా ఉంది పరిస్థితి. ఏం చేస్తాం. కానీ ఉప ముఖ్యమంత్రి పవనన్న మాత్రం గ్రామాల్లో రోడ్లు అభివృద్ధి చేసేలా చర్యలు తీసుకున్నారు.


మాట్లాడుతున్న హారిక, వైస్‌ఛైర్‌పర్సన్ శ్రీదేవి

ఎవరైతే ఏంటి అభివృద్ధి జరుగుతుందనుకోవడమే'నంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ ఉప్పాల హారిక అనడంతో సభ్యులు ఆసక్తిగా ఆలకించారు. **బుధవారం మచిలీపట్నంలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో స్థాయి సంఘాల సమావేశంలో వివిధ శాఖల అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష సందర్భంగా జరిగిన సంభాషణలివి.**

★ ధాన్యం కొనుగోళ్లపై సమీక్షిస్తున్న సమయంలో 'ఈసారి రైతులే తమకు నచ్చినట్లు ధాన్యం విక్రయించుకునేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసిందని, దీనిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నామని' సివిల్ సప్లయిస్ అధికారులు చెప్పారు. ఆ సమయంలో హారిక మాట్లాడుతూ 'ఇంకా అవగాహన ఏముంది. రైతులు తమకు నచ్చినచోట ధాన్యాన్ని అమ్ముకుంటారు. ధాన్యం విక్రయాల్లో వివిధ రకాల నిబంధనల కారణంగానే కదా ఇలా కూర్చోవాల్సి వచ్చిందని' అనడంపై పలువురు వివిధ రకాలుగా చర్చించుకున్నారు.

ప్రొటోకాల్ పాటించకుంటే ఎలా

ప్రభుత్వ పథకాల గురించి స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని, అర్హులైన ప్రజలందరికీ అవి చేరేలా కృషి చేయాలని జడ్పీ ఛైర్‌పర్సన్ అధికారులకు సూచించారు. తాము ప్రాతినిధ్యం వహించే ప్రాంతాల్లో చేపట్టే కార్యక్రమాల సమాచారం కూడా అధికారులు తమకు ఇవ్వడం లేదని కొందరు ప్రజాప్రతినిధులు సమావేశంలో ఆమె దృష్టికి తీసుకొచ్చారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ గరికపాటి శ్రీదేవి మాట్లాడుతూ తమ మండల పరిధిలో వరద కారణంగా అపారనష్టం జరిగిందని, ఎంత మందికి పరిహారం వచ్చిందో తెలియదన్నారు. దీనిపై ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ వెంటనే సమాచారం అందించేలా మండల స్థాయి అధికారికి ఆదేశాలు జారీ చేస్తామన్నారు. ప్రజాప్రతినిధులు కోరుకునేది గౌరవమేనని...ప్రొటోకాల్ పాటించకుంటే ఎలా అంటూ జడ్పీ ఛైర్‌పర్సన్ హారిక ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈసారి పునరావృతమైతే షోకాజ్ నోటీసు జారీ చేస్తామని హెచ్చరించారు.

ప్రభుత్వ చొరవతో వరద నివారణ

బుడమేరు వరద కారణంగా విజయవాడలో వివిధ ప్రాంతాల్లో పీకల్లోతు నీళ్లు నిలబడిపోయాయని, అలాంటి సమయంలో కూడా ప్రజలు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం చొరవతో ప్రతి ఇంటికీ వివిధ రకాల మందులతో కిట్‌లు పంపించామని ఎన్టీఆర్ జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి సుహాసిని అన్నారు. మచిలీపట్నంలోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి 30వేల కిట్లు అందించామని కృష్ణా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి జి.గీతాబాయి తెలిపారు. దీనిపై జడ్పీఛైర్‌పర్సన్‌తో పాటు సభ్యులు చప్పట్లుచరుస్తూ అధికారులను అభినందించారు.


స్త్రీ, శిశుసంక్షేమం, రక్షణ అంశంపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న అధికారులు

వివిధ శాఖల వారీగా సమీక్ష

విద్య, వైద్యం, వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, సాంఘిక సంక్షేమం, రక్షణ, ప్లానింగ్, ఆర్థిక తదితర అంశాలపై శాఖలవారీగా సమీక్షించారు. పలువురు సభ్యులు ఆయా విభాగాల వారీగా సమస్యలను లేవనెత్తగా సంబంధిత అధికారులు వివరణ ఇచ్చారు. గ్రామాల్లో రక్షితనీటి పథకాలు అస్తవ్యస్తంగా తయారయ్యాయని, సమస్యలు పరిష్కరించి ప్రజలకు శుద్ధినీటిని అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలజీవన్‌మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నందున అవసరాలకు అనుగుణంగా నీటి వనరులు ఏర్పాటు చేసేందుకు కృషి చేయాలన్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి గృహాలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ఆర్‌జీఎస్ ద్వారా కొత్తగా గోకులాలు నిర్మిస్తున్నందున దరఖాస్తు చేసుకున్నవారందరికీ మంజూరయ్యేలా అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలన్నారు. జడ్పీ స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా జిల్లా పరిషత్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల డీఎస్‌వోలు హాజరు కాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. సీఈవో కన్నమనాయుడు, డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

కళ.. చెదిరినది


కృష్ణా నదీ తీరం వ్యర్థాలతో నిండిపోతోంది. ముఖ్యంగా పున్నమిఘాట్ వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు నదిలో వేయడంతో భారీగా చెత్త పేరుకుపోతోంది. దసరా ఉత్సవాల్లో అమ్మ వారి విగ్రహాలను సైతం ఇక్కడే నిమజ్జనం చేశారు. - ఈనాడు, అమరావతి

చూడ ముచ్చట.. మూడు ఇచ్చట!


- పొట్టిపాడు నుంచి చినకాకాని వయా గోసాల
- తూర్పు బైపాస్‌కు మూడు ప్రతిపాదనలు
- ఎట్టకేలకు సవివర నివేదిక పూర్తి
- సీఎం చంద్రబాబు నిర్ణయం కోసం నిరీక్షణ

ఈనాడు - అమరావతి

విజయవాడ నగర ట్రాఫిక్ రద్దీని నియంత్రించి రింగు రోడ్డుగా మారే తూర్పు బైపాస్ నిర్మాణం అరమరిక (అలైన్‌మెంట్)పై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. సవివర నివేదిక పూర్తి చేశారు. భూసేకరణ ప్రారంభించడమే తరువాయి. వచ్చే మార్చి లోపల టెండర్లు పిలిచి అప్పగించేలా సన్నాహాలు చేస్తున్నారు. మూడు ప్రతిపాదనలను కన్సల్టెన్సీ సంస్థలు రూపొందించి ఎన్‌హెచ్‌ఏఐకు అందించాయి. వీటిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదానికి పంపినట్లు తెలిసింది. ఆయన పరిశీలించాక కేంద్రానికి పంపి ఎన్‌హెచ్‌ఏఐ టెండర్లను ఆహ్వానించనుంది. డిసెంబరులోగా టెండర్లు పిలిచే వీలుంది. డీపీఆర్ రూపొందించిన సంస్థలు రెండో ప్రతిపాదన అనువు అని సిఫార్సు చేసినట్లు తెలిసింది. డీపీఆర్‌ను 'ఈనాడు' సంపాదించింది. వివరాలు ఇవీ..

ప్రతిపాదనలు ఇవీ...

జాతీయ రహదారి-16 (చెన్నై-కోల్‌కత్తా) విస్తరణలో భాగంగా విజయవాడకు బైపాస్ రహదారి నిర్మిస్తున్నారు. ఇది నగరానికి పశ్చిమవైపు కృష్ణా నది మీదుగా వెళుతుంది. ఎన్‌హెచ్-16 విజయవాడ నగరం బెంజిసర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు మీదుగా వెళుతుంది. ట్రాఫిక్ ఎక్కువ ఉండటం.. సర్వీసు దారులూ లేకపోవడంతో ప్రమాదాలు పెరిగాయి. దీంతో రహదారి విస్తరణ కాజా నుంచి కృష్ణా నది మీదుగా గొల్లపూడి, నున్న మీదుగా చిన్నఅవుటపల్లి వరకు బైపాస్ నిర్మిస్తున్నారు. దీనికి వ్యతిరేక దిశలో ఒక బైపాస్ నిర్మిస్తే.. అనువుగా ఉంటుందని గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రతిపాదించారు. దీనికి జాతీయ రహదారుల సంస్థ అంగీకరించి, భూసేకరణ రాష్ట్ర ప్రభుత్వం భరించాలని కోరింది. తర్వాత ప్రభుత్వం మారింది. తూర్పు బైపాస్‌కు కేడీఎం, చైతన్య కన్సల్టెన్సీ సంస్థలు సవివర నివేదిక (డీపీఆర్)ను రూపొందించే బాధ్యత అప్పగించారు.



★ కన్సల్టెన్సీ సంస్థలు రెండో ప్రతిపాదన సిఫార్సు చేశాయి. అన్ని ప్రతిపాదనలు పొట్టిపాడు వద్ద ప్రారంభమై చినకాకాని వద్ద ఎన్‌హెచ్-16లో కలుస్తాయి. రెండు ప్రాంతాల్లోనూ జంక్షన్ నిర్మాణం సులువుగా ఉంటుందని ప్రతిపాదించాయి. రెండో ప్రతిపాదన ప్రకారం పశ్చిమ బైపాస్‌లోకి సులభంగా ప్రవేశించే వీలుంది. ★ విజయవాడ నగరానికి కొంత దూరంగా ఉండటంతో భూసేకరణ వ్యయం తగ్గే వీలుంది. నగరానికి దగ్గరగా వచ్చిన కొద్దీ భూసేకరణ వ్యయం పెరుగుతుంది.

★ విమానాశ్రయానికి దూరంగా అలైన్‌మెంట్ ఉండటంతో ఎయిర్‌పోర్టు అథారిటీ నుంచి ఎలాంటి అభ్యంతరాలు ఉండవు. ★ కృష్ణా నదిపై నిర్మించే వంతెన మొదటి, మూడో ప్రతిపాదనల కన్నా రెండో ప్రతిపాదనలో నిర్మించే దూరం (3.355కిమీ) తక్కువ. ★ బందరు పోర్టు కనెక్టివిటీకి ఎన్‌హెచ్-65 నుంచి అనుసంధానం సులభంగా ఉంటుంది. మిగిలిన తొలి, మూడు ప్రతిపాదనల కంటే రెండో ప్రతిపాదనలో వంతెనల నిర్మాణం కేవలం 8 మాత్రమే ఉంటాయి. ★ ఆర్వోబీల నిర్మాణం కూడా సులభంగా పూర్తి చేయవచ్చు.

అరమరిక ఇలా..!

తూర్పు బైపాస్ రెండు జిల్లాల్లో ఉంటుంది. కృష్ణా జిల్లాలో ఉంగుటూరు, గన్నవరం, కంకిపాడు, పెనమలూరు మండలాల మీదుగా వెళుతుంది. గుంటూరు జిల్లాలో దుగ్గిరాల మంగళగిరి మండలాల మీదుగా చినకాకాని చేరుతుంది.

★ **కృష్ణా జిల్లాలో** పొట్టిపాడు, ఆత్కూరు, పెదఅవుటపల్లి, చిన్నఅవుటపల్లి, అల్లాపురం, బుద్ధవరం, అజ్జంపూడి, కేసరపల్లి, మంతెన-1, ఉప్పులూరు, జగన్నాథపురం, మంతెన-2, పునాదిపాడు, గొడవర్రు, మద్దూరు, గోసాల, వణుకూరు మీదుగా కృష్ణా నది దాటుతుంది.

★ **గుంటూరు జిల్లాలో** పెదకొండూరు, చినపాలెం, శృంగారపురం, తుమ్మపూడి, చిలువూరు, చినవడ్లపూడి, పెదవడ్లపూడి, చినకాకాని గ్రామాల్లో భూసేకరణ చేయాలి.

★ కృష్ణా జిల్లాలో 59.036 శాతం దూరం ఉంటే.. గుంటూరు జిల్లాలో 40.964 శాతం దూరం ఉంది. మూడు ప్రతిపాదల్లో రెండో ప్రతిపాదన ఖర్చు ఎక్కువ.. రూ.4,596.29 కోట్లు.

మల్లవల్లికి మహర్దశ..

- పాత ధర రూ.16.50 లక్షలకే ఎకరం
- ధరలు పెంచి వేధించిన వైకాపా ప్రభుత్వం...

పరిశ్రమకు వెన్నుదన్నుగా సీఎం చంద్రబాబు



ఎకరం.. రూ.89.50 లక్షలు!

ఈనాడు, అమరావతి

"వైకాపా పాలనలో నిరాదరణకు, వేధింపులకు గురైన మల్లవల్లి పారిశ్రామికవాడకు మహర్దశ పట్టనుంది. పార్కుకు పునర్జీవం కల్పించే ఏపీఐఐసీ ప్రతిపాదనలను మంత్రివర్గం బుధవారం ఆమోదించింది. వెరసి పారిశ్రామిక వేత్తలకు భారీ ఊరట లభించింది. నాటి జగన్ నిర్ణయాలతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు.. తమకు కేటాయించిన ప్లాట్లను సైతం రద్దు చేసుకున్నారు. ప్రస్తుతం తిరిగి వారికి మరో అవకాశం ఇవ్వాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా గత ప్రభుత్వంలో భారీగా పెంచిన ప్లాట్ల (స్థలాల) ధరలను తగ్గించింది. మొదట నిర్ణయించిన మేరకు ఎకరం రూ.16.50 లక్షలు వసూలు చేయాలని ఆమోదించింది."

"ప్రతిపక్ష హోదాలో జగన్ పాదయాత్ర నాటి హామీలకు భిన్నంగా మల్లవల్లిపై ఉక్కుపాదం మోపారు. పరిశ్రమల స్థాపనకు అనుకూల నిర్ణయాలు లేకపోగా.. ఎక్కువ ధరలు నిర్ణయించి సొమ్ములు చెల్లించాలని భీష్మించారు. దీంతో చాలామంది తమ ప్లాట్లను రద్దు చేసుకున్నారు. మరోవైపు భూములు ఇచ్చి పరిహారం రాని రైతులకు సొమ్ములు చెల్లిస్తానని హామీ ఇచ్చిన జగన్ సీఎం అయ్యాక వారిని పట్టించుకోలేదు. ప్రస్తుతం వారికి పరిహారం ఇచ్చే అంశమూ మంత్రివర్గంలో చర్చ జరిగింది. దీనిపై సీఎం చంద్రబాబు సానుకూల స్పందనతో మల్లవల్లి రూపురేఖలు మారనున్నాయి."

మల్లవల్లిలో సర్వే నెంబరు-11లో 1,460 ఎకరాలను 2016లో ఏపీఐఐసీ తీసుకుని పారిశ్రామిక వాడ ఏర్పాటు చేసింది. అప్పటి తెదేపా ప్రభుత్వం పారిశ్రామిక యూనిట్ల స్థాపనకు ఎకరం రూ.16.50 లక్షలకు కేటాయించింది. అశోక్ లేలాండ్, మోహన్ స్పిన్‌టెక్, ఫుడ్‌పార్కులో పలు యూనిట్లు ఏర్పాటయ్యాయి. మరోవైపు వైకాపా ప్రభుత్వం వచ్చాక ఎకరం రూ.89.50 లక్షలకు పెంచి.. అంతే చెల్లించాలని పారిశ్రామిక సంస్థలకు నోటీసులు ఇచ్చింది. కొందరు అప్పటికే యూనిట్లు నిర్మించడంతో చెల్లించారు. మిగిలిన వారు అంత ధర చెల్లించలేక రద్దుకు దరఖాస్తు చేశారు. వైకాపా జమానాలో మల్లవల్లిలో కొత్త యూనిట్లు లేవు. పురోభివృద్ధి లేదు. నిర్మాణమైన అశోక్ లేలాండ్ సైతం ప్రభుత్వ ప్రోత్సాహం లేదని ఉత్పత్తి ప్రారంభించలేదు.

కొలువుల పండగే...



150 ఎకరాల్లో ఎంఎస్‌ఎంఈలను ఏర్పాటు చేస్తున్నట్లు సీఎం చంద్రబాబు ప్రకటించారు. గతంలో రద్దు చేసుకున్న వారు, సొమ్ములు చెల్లించిన వారికి తిరిగి ఎకరం రూ.16.50 లక్షలకే కేటాయించనున్నారు. 60 రోజుల్లో పనులు ప్రారంభించాలని షరతు విధించారు. మొత్తం 33 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

కూటమి రాకతో వెలుగులు...



కూటమి ప్రభుత్వం కొలువుదీరాక అశోక్ లేలాండ్ ఉత్పత్తి కొనసాగించే ఏర్పాట్లు చేసింది. రైల్ నీరు యూనిట్ ఏర్పాటైంది. ఫుడ్ పార్క్ కేటాయించారు. నాడు తక్కువ ధరకే స్థలాలు తీసుకున్నారని ప్రభుత్వంలో ఓ ప్రజాప్రతినిధి పారిశ్రామికవేత్తలను వేధించారు. తెదేపా సానుభూతిపరులు ఉన్నారని మల్లవల్లి, వీరపనేనిగూడెం పారిశ్రామికవాడపై విజిలెన్సు విచారణకు ఆదేశించింది. పరిశ్రమల స్థాపనలో ప్రధాన పెట్టుబడి స్థలంపై ఉండదని వారు పదేపదే ఏపీఐఐసీకి విన్నవించినా.. ఫలితం లేదు. దాదాపు 277 మంది పరిశ్రమలు పెట్టలేమనీ, చెల్లించిన మొత్తం తీసేసుకున్నారు. తాజాగా ప్రభుత్వం ఎకరం రూ.16.50 లక్షలే నిర్ణయించడంతో మళ్లీ ముందుకు వచ్చే వీలుంది.

నిర్వాసితులకూ న్యాయం...

పరిహారం అందని నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని సీఎం హామీ ఇచ్చారు. గత తెదేపా ప్రభుత్వం రైతులకు ఎకరాకు రూ.7.50 లక్షలు ఇవ్వాలని నిర్ణయించింది. 490 మంది, 716.44 ఎకరాలు సాగు చేస్తున్నట్లు తేల్చారు. ఎకరాకు రూ.7.50 లక్షల చొప్పున రూ.53.73 కోట్లు చెల్లించేలా నిర్ణయించింది. ఫిర్యాదులు రావడంతో 443 మందికి 615.6 ఎకరాలకు రూ.46.17 కోట్లు చెల్లించారు. 32 మందిని బినామీలుగా పేర్కొనగా, మరో 15 మంది వారి బ్యాంకు ఖాతా వివరాలు సమర్పించలేదని పరిహారం చెల్లించలేదు. గ్రామంలో వ్యవసాయ కూలీలకు 1,228 మందికి రూ.50 వేల చొప్పున రూ.61.40 లక్షలు పరిహారం చెల్లించారు. తర్వాత ప్రభుత్వం మారింది. కమిటీలు వేశారు. మూడు పర్యాయాలు పరిశీలించారు. గుడివాడలో నిర్వాసితుల నుంచి అర్జీలు స్వీకరించారు. 257 మంది ఆధారాలతో దరఖాస్తు చేసినా.. వైకాపా ప్రభుత్వం పరిహారం ఇవ్వనేలేదు. ప్రస్తుతం వీరి సమస్య పరిష్కరించనున్నారు.


మోపిదేవి- వెంకటాపురం జడ్పీ రహదారి దుస్థితి

అడుగుకో మడుగు

కిలోమీటరు పరిధిలో 240 గుంతలు

మోపిదేవి నుంచి వెంకటాపురం జడ్పీ రహదారి అత్యంత భయానకంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో గాలికి వదిలేయడంతో రోడ్డు కిలోమీటరు పరిధిలో దాదాపు 240 గుంతలు ఏర్పడి నరకాన్ని తలపిస్తోంది. సైకిళ్ల మీద ప్రయాణం కష్టంగా మారింది. ఉయ్యాల-జంపాల మాదిరి ప్రయాణం గుర్తుకు వస్తుంది. గోతులను పూడ్చివేసేందుకు గత సంవత్సరం రావివారిపాలెంకు చెందిన పరుచూరి అంజయ్య సొంత నిధులతో బేబీ చిప్స్ వేయించి మరమ్మతులు చేయించారు. కొంతకాలానికి మళ్లీ మొదటికే వచ్చింది. ఎప్పుడూ రద్దీగా ఉండే జడ్పీ రహదారికి తాత్కాలిక మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మోపిదేవి


రావివారిపాలెం వద్ద పెద్ద పెద్దగోతుల్లో వర్షపునీరు

కొంతమేర తగ్గిన భవానీల రాక

27 లక్షల లడ్డూ ప్రసాదాల విక్రయం


ప్రసాద విక్రయాల కేంద్రం వద్ద సందడి

ఇంద్రకీలాద్రి: దసరా ఉత్సవాలు ముగిశాక కూడా మూడు రోజులుగా పోటెత్తిన భవానీ దీక్షాధారుల రాక క్రమేపీ తగ్గుతోంది. పాత బస్తీ వీధుల్లో ఎక్కడ చూసినా భవానీ దీక్షలు విరమించిన భక్తులే దర్శనమిచ్చారు. గత 13 రోజుల్లో 27 లక్షల లడ్డూ ప్రసాదాలను కౌంటర్లలో విక్రయించారు. మరో 2 లక్షల లడ్డూలు సిద్ధంగా ఉన్నాయి. విజయదశమి రోజు భవానీ దీక్షాధారులు పోటెత్తడంతో ప్రసాదాల కొరత ఏర్పడింది. మూలా నక్షత్రాన్ని మించి భవానీ దీక్షాధారులు జగన్మాత దర్శనానికి తరలి రావడంతో ముందు జాగ్రత్తగా పెనుగంచిప్రోలు, పెదకాకాని, మోపిదేవి నుంచి 37 వేల లడ్డూలను సిద్ధం చేయాల్సి వచ్చింది. మూలానక్షత్రం రోజు భక్తులకు ఉచిత లడ్డూప్రసాదాన్ని అందజేశారు. వీటితోపాటు ఆరు లడ్డూల ప్యాకెట్ల విక్రయాలు సైతం అనుకున్న దానికంటే ఎక్కువ జరిగాయి. దీంతో దసరా రోజున భక్తుడికి 5 లడ్డూలు మాత్రమే ఇవ్వాలని నిర్ణయించారు. అమ్మవారి దర్శనానికి ఇంకా భవానీలు వచ్చే అవకాశం ఉండటంతో పోలీసు భద్రతను కొంత మేర కొనసాగిస్తున్నారు. మరో రెండు రోజులు ప్రసాదాలకు లోటు లేకుండా ప్రస్తుతం ఉన్న విక్రయ కేంద్రాల వద్దే భక్తులకు అందజేస్తామని అధికారులు తెలిపారు.

కిక్కు.. అంతంతే..!

- తొలి రోజు ఏర్పాటైంది 25 మాత్రమే
- దుకాణాలకు ఆలస్యంగా సరకు రాక

ఈనాడు - అమరావతి: చాలా కాలం తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. కొత్త విధానంలో భాగంగా ప్రభుత్వ షాపులను రద్దు చేసి.. వీటికి అనుమతిచ్చింది. బుధవారం నుంచి ఇవి తెరుచుకున్నాయి. లైసెన్సులు దక్కించుకున్న వారు తొలి రోజు అరకొరగానే ఏర్పాటు చేశారు. సరైన ప్రాంతం, షాపు దొరక్కపోవడమే ఇందుకు కారణం. ఒక వైపు మంగళవారం రాత్రితో ప్రభుత్వ దుకాణాలు మూతపడడం.. ఇటు బుధవారం చాలా ప్రైవేటు షాపులు తెరుచుకోలేదు. దీంతో తెరిచిన షాపుల వద్దకు మందుబాబులు క్యూ కట్టారు. తెరిచిన దుకాణాలకూ సకాలంలో సరకు రాలేదు. దీనికి తోడు పాతధరలే ఉండడంతో పలువురు పెదవి విరుస్తున్నారు. కొత్త సరకు ఇంకా రాలేదని దుకాణదారులు సర్ది చెబుతున్నారు. కాకపోతే గతం కంటే ఎక్కువ బ్రాండ్లు మాత్రం అందుబాటులోకి వచ్చాయని చెబుతున్నారు.

✪ ఎన్టీఆర్ జిల్లాలో 113 మద్యం దుకాణాలకు తొలి రోజు కేవలం 25 మాత్రమే తెరుచుకుని వ్యాపారాలు సాగాయి. ఈసారి ఎక్సైజ్ శాఖ గతం కంటే భిన్నంగా నగరపాలిక, పురపాలిక, మండలాల పరిధి యూనిట్‌గా కొత్త విధానాన్ని రూపొందించారు. దీని ప్రకారమే షాపులకు దరఖాస్తులు ఆహ్వానించారు. ఈ నేపథ్యంలో ఏ ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేస్తే.. వ్యాపారం బాగా సాగుతుందో అని సర్వే నిర్వహించి షాపులు తెరుస్తున్నారు. సరైన ప్రాంగణం దొరక్కపోతే మరో రద్దీ ప్రాంతంలో వ్యాపారులు అన్వేషిస్తున్నారు.

✪ మూతపడిన ప్రభుత్వ దుకాణాల నుంచి మిగిలిన స్టాకు.. మద్యం డిపోలకు తరలింపును బుధవారం ఉదయం నుంచి ప్రారంభించారు. వచ్చిన సరకు వివరాలను డిపోల సిబ్బంది నమోదు చేసుకోవడంతో ఊపిరి సలపకుండా ఉండడంతో ప్రైవేటు దుకాణదారులకు సకాలంలో మద్యం ఇవ్వలేదు. దీంతో బుధవారం రాత్రికి 60 మంది వ్యాపారులు సరకును నుంచి తీసుకున్నారు. వీరిలో వ్యాపారాలు ప్రారంభించింది తక్కువ మందే. మొదటి రోజు గొల్లపూడి, నిడమానూరులో డిపోల నుంచి దాదాపు రూ.6.5 కోట్ల విలువైన మద్యాన్ని వ్యాపారులు తీసుకెళ్లారు. పలు చోట్ల ప్రభుత్వ దుకాణాలు నడిచిన ప్రాంగణాల్లోనే ఏర్పాటు చేశారు.


విజయవాడలో ఓ మద్యం దుకాణం వద్ద రద్దీ

గాల్లో పక్షిలా.. సేవలు సులువుగా..





డ్రోన్లు తయారు చేస్తున్న విద్యార్థులు

ఈనాడు డిజిటల్, అమరావతి

అధునాతన సాంకేతికతతో డ్రోన్ల తయారీ
విద్యార్థుల సరికొత్త ఆవిష్కరణలు

డ్రోన్... గాల్లో పక్షిలా ఎగురుతూ మనుషులకు బదులుగా పంట పొలాల్లో మందులు చిమ్ముతుంటే అందరూ ఆసక్తిగా చూశారు. రైతులకు కొత్తగా, వింతగా అనిపించింది. ఇటీవల విజయవాడలో వరద బాధితులు నీటిలో చిక్కుకుపోతే.. వాటి ద్వారానే ఆహారం, తాగునీరు వంటివి అందించారు. అత్యున్నత సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి.. మరిన్ని రంగాలకు వాటి సేవలు విస్తృతం చేసేలా తీర్చిదిద్దుతున్నారు ఉమ్మడి కృష్ణా జిల్లాకు చెందిన విద్యార్థులు. ఆరోగ్యం, రక్షణ, నిఘా, ట్రాఫిక్, విపత్తు నిర్వహణ.. ఇలా విభిన్న రంగాల్లో క్లిష్టమైన పనులను తేలిగ్గా చేసేలా స్వదేశీ పరిజ్ఞానంతో డ్రోన్లు తయారు చేస్తున్నారు విజయవాడ సమీపంలోని ధనేకుల ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల విద్యార్థులు. సరికొత్త ప్రయోగాలు చేస్తూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అవార్డులు గెలుపొందారు.

ఇజ్రాయెల్ నిపుణుల పర్యవేక్షణలో.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో కళాశాల యాజమాన్యం ఏడాది కిందట అధునాతన సాంకేతికతతో కూడిన డ్రోన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేసింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను నెలకొల్పింది. డ్రోన్లు, ఏఐ టెక్నాలజీలో పరిజ్ఞానం ఉన్న బెంగళూరులోని ద్రోణాచార్య టెక్ హబ్‌తో ఎంవోయూ కుదుర్చుకుంది. సరికొత్త, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందుబాటులోకి తెచ్చింది. ఆసక్తి ఉన్నవారికి శిక్షణ ఇస్తోంది. ఈ నెల 22, 23వ తేదీల్లో మంగళగిరిలో నిర్వహించే 'అమరావతి డ్రోన్ సమ్మిట్'లో రాణించాలనే ధ్యేయంతో విద్యార్థులు వినూత్న రీతిలో డ్రోన్లు తయారు చేస్తున్నారు.

విపత్తు సమయాల్లోనూ సేవలు



ఇటీవల విజయవాడకు వచ్చిన భారీ వరదల్లో.. మనుషులు వెళ్లేందుకు వీల్లేని కాలనీలకు డ్రోన్లు వెళ్లి వరద బాధితులకు ఆహార పదార్థాలు అందించి ఆకలి తీర్చాయి. కేవలం ఆహారం అందించడమే కాకుండా.. బాధితులకు మరిన్ని సేవలు అందించేలా యూఏఈ ఆపరేషన్స్ పేరిట డ్రోన్లు తయారు చేశాం. వీటిని వ్యవసాయంలో పురుగు మందులు పిచికారి చేయడానికీ ఉపయోగపడేలా తీర్చిదిద్దాం.

– జితిన్, మూడో సంవత్సరం

కళాశాల ల్యాబ్ వేదికగా...



డ్రోన్ల బాడీ, ఇతర విభాగాలను కళాశాల ల్యాబ్‌లోని త్రీడీ ప్రింటర్ ద్వారా కావాల్సిన రీతిలో తయారు చేస్తున్నాం. మేక్ ఇన్ ఇండియా కాన్సెప్ట్ అమలు కోసం దేశంలో తయారైన పరికరాలనే వినియోగిస్తున్నాం. విజయవాడలోని పలు దుకాణాల్లో తిరిగి అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను కొనుగోలు చేసి.. డ్రోన్లకు అమర్చుతున్నాం.

– జయశ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థిని


ట్రాఫిక్ నియంత్రణకు తోడ్పాటు..



ప్రకృతి విపత్తుల సమయాల్లో ప్రజలకు వేగంగా హెచ్చరికలు పంపేలా.. మోడ్రన్ అటానమస్ డ్రోన్ ఫర్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్(మ్యాడ్) పేరిట మరో సరికొత్త డ్రోన్‌ను తయారు చేశాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాలను గుర్తించి.. సమీపంలోని వాహనదారుల మొబైల్ ఫోన్‌లకు సందేశాలు పంపుతుంది. చేపలు, రొయ్యల చెరువుల్లో బ్యాక్టీరియా తెగుళ్లను గుర్తించి.. వాటి నివారణ మార్గాలు రైతులకు తెలియజేసేలా రూపొందించాం.

– బెల్లంకొండ కమలాకరరావు, చివరి సంవత్సరం

సమ్మిట్‌లో సత్తా చాటేలా...



డ్రోన్ టెక్నాలజీని అభివృద్ధి చేసి, తద్వారా విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ప్రత్యేక ల్యాబ్‌ను ప్రారంభించాం. విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారు. వారికి శిక్షణ ఇస్తున్నాం. తీర్ఫీదు పొందిన వారు.. వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. సొంతంగా డ్రోన్ల తయారీ సంస్థలు కూడా ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే 'అమరావతి డ్రోన్ సమ్మిట్'లో పాల్గొని సత్తా చాటడమే లక్ష్యంగా విద్యార్థులను సిద్ధం చేస్తున్నాం.

– కడియాల రవి, ప్రిన్సిపల్, ధనేకుల ఇంజినీరింగ్ కళాశాల

ఆహారంలో నాణ్యత లోపిస్తే సహించం



ఆసుపత్రిలో అన్నం, కూరలను పరిశీలిస్తున్న గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ (గ్రామీణం), న్యూస్‌టుడే: ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు అందించే ఆహారంలో నాణ్యత లేకుంటే సహించేది లేదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పష్టం చేశారు. స్థానిక ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందించే ఆహారాన్ని పరిశీలించి నాణ్యత లేని భోజనం, కూరలు చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులతో మాట్లాడగా రోజూ ఇదే విధంగా ఆహారం ఉంటోందని వారు తెలుపగా గుత్తేదారుకు ఫోన్ చేసి తీరు మారకుంటే చర్యలు తప్పవన్నారు. ఆసుపత్రిలో వైద్యాధికారులు నిత్యం రోగులకు పెట్టే ఆహారాన్ని పరిశీలించి బాగోలేకుంటే గుత్తేదారుపై చర్యలకు సిఫారసు చేయాలన్నారు. రోజూ దోసకాయ కూర పెడుతున్నారని, పాలు ఇవ్వడం లేదని రోగులు ఫిర్యాదు చేశారని ఎమ్మెల్యే తెలిపారు. పైఅంతస్తులో తాగునీరు లేదని దీనికోసం గ్రౌండ్ ఫ్లోర్‌కు రావాల్సి వస్తుందని రోగులు చెబుతున్నారని ఎందుకు ఇలా అయ్యిందని అధికారులను ప్రశ్నించారు. జెరియాట్రిక్(వృద్ధుల) వార్డు వద్ద చెత్త పేరుకు పోవడాన్ని ఎమ్మెల్యే రాము గుర్తించి ఆ పరిస్థితి కొనసాగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఎంతో చేయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతుంటే అధికారులు దానిని నిర్వీర్యం చేసేలా తప్పులు పాల్పడరాదన్నారు. మున్సిపల్ మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, తెదేపా నేతలు సీహెచ్ జగన్ మోహన్‌రావు, పంద్రాజు సాంబయ్య, సయ్యద్ జబీన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్. ఇందిరా దేవి, వైద్యులు పాల్గొన్నారు.

ర్యాగింగ్ చట్టరీత్యా నేరం



మాట్లాడుతున్న న్యాయమూర్తి కేవీఆర్ కృష్ణయ్య, వేదికపై కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ తదితరులు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కేవీఆర్ కృష్ణయ్య అన్నారు. మచిలీపట్నం ప్రభుత్వ వైద్య కళాశాలలో బుధవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని వివిధ చట్టాల గురించి విద్యార్థులకు వివరించారు. సీనియర్లు, జూనియర్లు అన్న తేడా లేకుండా విద్యార్థులు అందరూ స్నేహ పూర్వకంగా మెలగాలని సూచించారు. ర్యాగింగ్ అనేది సరదాకు చేసినా చట్టపరంగా శిక్షలు అనుభవించాల్సి వస్తుందన్నారు. బాలికలు అపరిచిత వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కొందరు వ్యక్తులు ముఠాలుగా ఏర్పడి మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, అలాంటివారు కనిపిస్తే వెంటనే పోలీసుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. చట్టాల గురించి తెలుసుకుంటే జీవితంలో ఎదురయ్యే సవాళ్లను సులువుగా పరిష్కరించుకోవచ్చన్నారు. న్యాయవాది అజ్మతున్నీసా, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్సై మస్తాన్‌ఖాన్, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వేము కోటేశ్వరరావు వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ ఆశాలత, స్వర్ణలత, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆర్‌ఎంవో నిరంజన్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటరుగా నమోదు చేసుకోండి: డీఆర్వో

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల శాసనమండలి నియోజకవర్గంలో అర్హులైన వారు నవంబరు 6వ తేదీ లోపు ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా రెవెన్యూ అధికారి కె.చంద్రశేఖరరావు కోరారు. బుధవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డీఆర్వో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో ఫారం 18ను సమర్పించవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌లో సీఈవో ఏపీ ఈరోల్స్ వెబ్‌సైట్ ద్వారా, ఆఫ్‌లైన్‌లో సంబంధిత అసిసెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌కు ఫారం 18ను సమర్పించడం ద్వారా ఓటరుగా నమోదు కావచ్చన్నారు. ఓటరుగా నమోదయ్యేందుకు 2024 నవంబరు 1వ తేదీ నాటికి ఏదైనా డిగ్రీ పూర్తి చేసి మూడు సంవత్సరాలు గడిచి ఉండాలన్నారు. ఆధార్‌కార్డు నకలు, ఓటరు ఐడీ, నివాస ధ్రువపత్రం జతపర్చాలన్నారు. అక్టోబరు 15 నాటికి కృష్ణా జిల్లాలో ఆఫ్‌లైన్ ద్వారా 575 దరఖాస్తులు అందినట్లు చెప్పారు.

నట్టల నివారణ ఉపయోగించుకోండి



గొర్రెకు నివారణ మందు వేస్తున్న నర్సింహులు

గోపువానిపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: జిల్లాలో జరుగుతున్న నట్టల నివారణ కార్యక్రమాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు వినియోగించుకోవాలని జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి నర్సింహులు విజ్ఞప్తి చేశారు. బుధవారం గోపువానిపాలెంలో నట్టల నివారణ మందు పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలో 1,31,520 గొర్రెలు, 24,295 మేకలు ఉన్నాయని, నట్టలు ఏర్పడితే మేకలు బరువు తగ్గిపోతాయన్నారు. నట్టల నివారణ మందులను జిల్లాలోని సంబంధిత ఆసుపత్రులకు సరఫరా చేశామని చెప్పారు. కార్యక్రమంలో గోపువానిపాలెం సర్పంచి వాలిశెట్టి చంద్రరేఖ, గొర్రెలు, మేకల కో-ఆపరేటివ్ సొసైటీ డైరెక్టర్ గోవాడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్య కార్పొరేటీకరణ వ్యతిరేకిద్దాం

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: విద్యను కార్పొరేట్ పరం చేయడం కారణంగా తలెత్తుతున్న దుష్పరిణామాల నుంచి విద్యార్థి లోకానికి విముక్తి కలిగించేందుకు ఏఐఎస్‌ఎఫ్ పోరాడుతుందని సమాఖ్య రాష్ట్ర కోశాధికారి ఎం.సాయికుమార్ అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ కృష్ణాజిల్లా 34వ మహాసభ ఈ నెల 21న జరుగనున్న సందర్భంగా బుధవారం స్థానిక మోదుమూడి శ్రీహరిరావు భవన్‌లో పోస్టర్లను విద్యార్థి నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ వసతిగృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని, విద్యా సంస్థల్లో ర్యాగింగ్ భూతాన్ని అణచివేయాలని, యువత గంజాయి, మద్యానికి బానిసలు కాకుండా ఏఐఎస్‌ఎఫ్ పోరాటాలు చేపడుతుందన్నారు. 34వ మహాసభను పురస్కరించుకుని 21న రేవతిసెంటర్ నుంచి భెల్ కంపెనీ ఆడిటోరియం వరకు విద్యార్థులతో ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. మహాసభకు ముఖ్యఅతిథులుగా ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వి.జాన్సన్‌బాబు, కె.శివారెడ్డి పాల్గొంటారని చెప్పారు. సమావేశంలో కృష్ణా జిల్లా కన్వీనర్ సాదిక్‌బాబు, బి.కార్తీక్, బి.నాని, ఎం.సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని నిరసన



పసుపు బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేస్తున్న ఒప్పంద అధ్యాపకులు


అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఒప్పంద అధ్యాపకులను క్రమబద్ధీకరించాలని కోరుతూ బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాంట్రాక్టు అధ్యాపకులు పసుపు రంగు బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జీవో నెం 114 ప్రకారం కాంట్రాక్టు అధ్యాపకులను గత ప్రభుత్వం రెగ్యులర్ చేస్తామని చెప్పిందని, కానీ ఐదేళ్ల కాలంలో రెగ్యులర్ చేయలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వమైనా తమని రెగ్యులర్ చేయాలని నినాదాలు చేశారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం నుంచి 19వ తేదీ వరకు పసుపు బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరు కానున్నట్లు తెలిపారు.

కారును తప్పించబోయి.. లారీ ఢీకొని..

లారీ డ్రైవర్ దుర్మరణం



వెంకన్న (పాతచిత్రం)



వాహనంలో చొదకుడి మృతదేహం

పెడన, న్యూస్‌టుడే: 216 జాతీయ రహదారిపై పెడన బైపాస్‌లో బుధవారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో లారీలో ఉన్న మరో డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. పోలీసుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం మోత్కూరు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ వరాల వెంకన్న(57), మరో డ్రైవర్ నిమ్మల రామచంద్రయ్యతో కలిసి ఈ నెల 5న మినీలారీతో ఝార్ఖండ్ రాష్ట్రం జెమ్‌షెడ్‌పూర్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఈ నెల 14న రాత్రి బయలుదేరి 216 జాతీయ రహదారి మీదుగా చెన్నైకు లోడుతో వెళ్తున్నారు. లారీ పెడన తోటమూల సెంటర్ దాటి నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ చేరుకునే సమయానికి ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవింగ్ సీటు పక్కనున్న వెంకన్న అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సమయంలో డ్రైవింగ్ చేస్తున్న నిమ్మల రామచంద్రయ్య స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి తరలివెళ్లి క్యాబిన్‌లో ఇరుక్కున్న వెంకన్న మృతదేహాన్ని బయటకు తీయించి మచిలీపట్నం ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఈ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది.

ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వేలేరుకు చెందిన ఓ యువకుడు ఆర్థిక ఇబ్బందుల కారణంగా మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఎస్సై జనార్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. వేలేరుకు చెందిన దోనవల్లి శేషుబాబు (40) ఎంబీఏ చదివి, గ్రామంలోనే వ్యవసాయం చేస్తారు. సమీప బంధువైన దోనవల్లి గంగాధరరావుకు, శేషుబాబు గతంలో రూ.30 లక్షలు అప్పుగా ఇచ్చాడు. అతను తిరిగి చెల్లించలేదు. వేలేరుకే చెందిన దోనవల్లి మురళీకృష్ణ వద్ద శేషుబాబు రూ.2 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. ఈ క్రమంలో రూ.11 లక్షలు బాకీ ఉన్నట్లు కోర్టులో కేసు వేయడంతో మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యాడు. దీంతో మంగళవారం ఉదయం గంగాధరరావు ఇంటి ముందు కూర్చుని పురుగుల మందు తాగాడు. స్థానికులు వెంటనే బాధితుడిని చిన్నఅవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. బుధవారం చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహానికి గన్నవరం ప్రభుత్వాసుపత్రిలో శవపరీక్షలు చేసి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మద్యం చోరీచేశాడని కొట్టడంతోనే నా భర్త మృతి
పోలీసులకు భార్య ఫిర్యాదు

మచిలీపట్నం (గొడుగుపేట): నగరంలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మృతుని భార్య ఫిర్యాదు మేరకు చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. ఉండి ప్రాంతానికి చెందిన గొర్రెల వెంకటేశ్వరరావు(38) అనే వ్యక్తి ఈనెల 13వ తేదీ రాత్రి బైపాస్ సర్కిల్ వద్ద రహదారి పక్కన దెబ్బలతో పడి ఉన్నాడు. అతన్ని గుర్తించిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆరా తీయడంతో ఆ రోజు స్థానిక బార్‌లో కొందరు యువకులు తాగుతున్న మద్యాన్ని వెంకటేశ్వరరావు దొంగిలించడంతో గుర్తించిన వారు అతనిపై దాడి చేశారు. ఆ దాడి కారణంగానే తన భర్త చనిపోయాడని మృతుని భార్య సరోజిని ఫిర్యాదులో పేర్కొనడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై నీరు నిలవకుండా చర్యలు

మంటాడ(పమిడిముక్కల) : విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిలో మంటాడ సమీప అండర్‌పాస్‌లో కొద్దిపాటి వర్షానికే భారీగా నీరు నిలిచి వాహనదారులకు, పాదచారులకు అసౌకర్యంగా ఉంటోంది. ఈ సమస్యపై పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా జాతీయ రహదారి అధికారులకు ఫిర్యాదు చేస్తూ స్వయంగా వచ్చి పరిశీలించాలని కోరారు. వర్ల అభ్యర్థనపై స్పందించిన జాతీయ రహదారుల ప్రాజెక్టు డైరెక్టరు శ్రీనివాసరెడ్డి, ఇంజినీర్లు బుధవారం అండర్‌పాస్ వద్దకు వచ్చి పరిశీలించారు. అనంతరం వర్లతో మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నీరు నిలువకుండా ప్రత్యామ్నాయ మార్గంలో నీటిని తరలించే చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.

22 నుంచి క్రీడాజట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు: జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో అండర్-19 విభాగంలో ఈ నెల 22వ తేదీ నుంచి పలు క్రీడాంశాల్లో వేర్వేరు ప్రదేశాల్లో జిల్లా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని సమాఖ్య కార్యనిర్వాహక కార్యదర్శి వేమూరి రవికాంత తెలిపారు. 22వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఉయ్యూరులోని ఏజీ, ఎస్‌జీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల అథ్లెటిక్స్, బాలుర కబడ్డీ, 23వ తేదీ ఉదయం 10 గంటల నుంచి విజయవాడలోని ఐజీఎంసీ స్టేడియంలో బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్, బాక్సింగ్, జూడో, ఉషు, మధ్యాహ్నం 2 గంటల నుంచి మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల వాలీబాల్, ఖోఖో, 24వ తేదీ ఉదయం 9 గంటల నుంచి పీబీ సిద్ధార్థ కళాశాలలో బాలబాలికల బ్యాడ్మింటన్, క్రికెట్, ఉదయం 10 గంటలకు మొగల్రాజపురంలోని బీఎస్‌ఆర్‌కే మున్సిపల్ హైస్కూల్‌లో బాలబాలికల మాల్కంబ్, 29వ తేదీ ఉదయం 9 గంటల నుంచి నగరంలోని చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో బాలబాలికల ఆర్చరీ జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలు

మచిలీపట్నం (గొడుగుపేట): చెల్లని చెక్కు కేసులో నిందితుడికి జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన మియాజ్‌అలీ వద్ద కోడూరు మండలం సాలెంపాలెం గ్రామానికి చెందిన కె.నాగవెంకట రవికుమార్ 2017 జులైలో రూ.13లక్షల అప్పు తీసుకున్నాడు. అప్పు తీర్చే క్రమంలో రవికుమార్ 2019 ఫిబ్రవరిలో రూ.9.8లక్షలకు చెక్కు ఇచ్చాడు. అలీ ఆ చెక్కును బ్యాంకులో వేయగా చెల్లదని తేలడంతో కోర్టులో ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ నిర్వహించగా నిందితునిపై నేరం రుజువు కావడంతో ఆరు నెలల జైలుశిక్ష విధించడంతోపాటు రూ.9.8లక్షలను పరిహారంగా బాధితునికి చెల్లించాలని ఎక్సైజ్ కోర్టు న్యాయమూర్తి ఎస్.మేరీ తీర్పు చెప్పారు. ఆ మొత్తం చెల్లించని పక్షంలో మరో 3నెలలు అదనంగా జైలుశిక్ష అనుభవించాల్సి వస్తుందని తీర్పులో పేర్కొన్నట్లు ఫిర్యాదుదారు తరఫున వాదించిన న్యాయవాది మహ్మద్‌రఫీ తెలిపారు.

ఆటో డ్రైవర్‌పై పోక్సో కేసు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: బాలికను మాయమాటలతో మభ్యపెట్టి బలవంతంగా తీసుకెళ్లిన ఘటనపై మచిలీపట్నం స్టేషన్‌లో కేసు నమోదైంది. నగరంలోని బందరుకోట చెందిన ఆటో డ్రైవర్ మణికంఠ గిలకలదిండికి చెందిన పదో తరగతి చదువుతున్న బాలికను బలవంతంగా తీసుకెళ్లడంతో పాటు ప్రశ్నించిన కుటుంబ సభ్యులపై బెదిరింపులకు పాల్పడ్డాడు. బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అతనిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

19న మెగా ఉచిత వైద్య శిబిరం

గన్నవరం (గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్టులో ఈనెల 19వ తేదీ మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు డైరెక్టర్ పరదేశి బుధవారం తెలిపారు. ఆస్టర్ రమేశ్ ఆస్పత్రి విజయవాడ వారి సహకారంతో నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు ప్రారంభిస్తారని చెప్పారు. శిబిరంలో గుండె, మెదడు, ఎముకలు, ఊపిరితిత్తులు, కండరాలు, కీళ్లు, సాధారణ వ్యాధుల నిపుణులతో ఉచితంగా పరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9505012312 చరవాణిలో సంప్రదించాలని వెల్లడించారు.

ద్విచక్ర వాహనాల దొంగ పట్టివేత



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు, నిందితుడితో పోలీసులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు, గుంటూరు జిల్లాల్లో ద్విచక్ర వాహనాల చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని వీరవల్లి పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. ఏలూరు సమీపంలోని కొత్తూరుకు చెందిన పోట్రు సాయి శేఖర్ వీరవల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు, విజయవాడ సత్యనారాయణపురం, గుంటూరు జిల్లా మంగళగిరి, ఏలూరులో ఒకటి చొప్పున ద్విచక్ర వాహనాలను చాకచక్యంగా అపహరించుకుపోయాడు. బుధవారం తిప్పనగుంట బస్టాప్ వద్ద అనుమానాస్పదంగా కన్పించడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. పలుచోట్ల చోరీలకు పాల్పడినట్లు అంగీకరించడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 5 ద్విచక్ర వాహనాలతో సహా నిందితుడ్ని నూజివీడు కోర్టులో హాజరుపర్చగా, న్యాయమూర్తి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై వివరించారు. ఎస్పీ గంగాధర్, సీఐ సత్యనారాయణ వీరవల్లి పోలీసుల్ని అభినందించారు.

మచిలీపట్నం

•మచిలీపట్నం •పెడన

వైభవంగా అమ్మవారి నిమజ్జన ఊరేగింపు



ఊరేగింపుగా నిమజ్జనానికి తరలుతున్న అమ్మవారు

ఎస్.ఎన్.గొల్లపాలెం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: దేవీ శరన్నవరాత్రులలో ఎస్.ఎన్. గొల్లపాలెంలో కొలువుదీరిన అమ్మవారి నిమజ్జనం భక్తుల కోలాహలం నడుమ ఊరేగింపుగా సాగింది. అలంకరించిన ట్రాక్టర్‌పై అమ్మవారిని ఉంచి ఊరేగింపుగా బీవీ తోటలోని మంచినీటి కాలువలో నిమజ్జనం చేశారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు కొల్లూరి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిశీలన

బంటుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉన్నత విద్య జోన్ 2, రాజమహేంద్రవరం ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ ఎస్. శోభారాణి బుధవారం సందర్శించారు. విద్యార్థులతో మమేకమై బోధన తీరును అడిగి తెలుసుకొన్నారు. తరగతి గదులు, రికార్డులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు.



బంటుమిల్లిలో అధ్యాపకులతో మాట్లాడుతున్న ఆర్జేడీ శోభారాణి

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

? నగరంలోని మూడుస్తంభాల కూడలిలోని అండర్‌పాస్ వద్ద తిష్ఠవేసిన నీరు రోజుల తరబడి కదలక పోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. -ఆదిశేషు



అండర్‌పాస్ వద్ద నిలిచిన నీరు

✔ సమస్య ఇప్పటికే నేషనల్ హైవే అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారితో మరోసారి మాట్లాడి సమస్య పరిష్కరించేలా కృషి చేస్తాం.

-బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

స్పందనకు వందనం

★ నగరంలోని ఈడేపల్లి, సుకర్లాబాద తదితర ప్రాంతాల్లో రహదారుల పక్కన మేటవేసిన చెత్తను తొలగించకపోవడంతో పశువులు చేరి రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఈ సమస్యను ఆయా ప్రాంతాల ప్రజలు మేమున్నాం.. మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా ఈనాడులో వార్త ప్రచురితమైంది. స్పందించిన అధికారులు సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. –మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే

తడీపొడి.. ఇక విడివడి..

✦ చెత్త విభజనపై ఇంటింటికీ వెళ్లి అవగాహన ✦ వేర్వేరుగా సేకరణకు ప్రాధాన్యం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

మచిలీపట్నంను స్వచ్ఛనగరంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగానే కలెక్టర్ డీకే బాలాజీ నగరంలో ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్ నిర్వహించేలా కార్యాచరణ చేపట్టారు. డంపింగ్ యార్డులో చెత్త మేటవేయకుండా ఇంటి వద్దే చెత్త విభజన జరిగేలా ఏర్పాట్లు చేశారు. ఆయన ఆదేశాలకు అనుగుణంగా నగరంలో చెత్త సేకరించేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంది. కొందరు తడి, పొడి చెత్త వేర్వేరుగా ఇస్తుంటే చాలా మంది కలిపేస్తున్నారు. అలాంటి వారిలో చైతన్యం నింపేందుకు పలువురు జిల్లా అధికారులకు బాధ్యతలు కేటాయించారు. దీంతో పాటు హోం కంపోస్టు తయారీపైనా అవగాహన కల్పించేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.



చెత్త సేకరిస్తున్న కార్మికులు

ఇంటి వద్దే ఎరువు తయారీ

ఇళ్ల నుంచి వచ్చే వ్యర్థాలను అక్కడే ఎరువుగా మార్చితే ఆ కుటుంబాలకు ఆదాయం సమకూరుతుందని తెదేపా హయాంలో హోంకంపోస్టు పథకాన్ని ప్రవేశపెట్టారు. మెప్మా ఆధ్వర్యంలో దీన్ని అమలు చేసేలా చర్యలు తీసుకున్నారు. దీనిపై విస్తృత కార్యాచరణ చేపట్టి పట్టణాల వారీగా యూనిట్లు కేటాయించారు. బందరు నగరంలోని 50 డివిజన్లకు 221 యూనిట్లు కేటాయించారు. డివిజన్ల వారీగా మహిళలను బృందాలుగా ఏర్పాటు చేసి ఎరువు తయారీపై అవగాహన కల్పించారు. ఆ తరువాత ఈ కార్యక్రమం ఆపివేయడంతో పంపిణీ చేసిన డబ్బాలు పాడైపోయాయి. ప్రస్తుతం ప్రతి ఇంటిలోనూ ఎరువు తయారు చేసుకునేలా ప్రజలను చైతన్యం చేసేదిశగా చర్యలు చేపట్టారు.



సూచనలిస్తున్న జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్

నగరంలో ఉన్న డివిజన్‌లు **50**

జనాభా **1.80** లక్షలు

మొత్తం ఇళ్లు **56** వేలు

రోజూ వచ్చే చెత్త **84** టన్నులు

రోజూ జిందాల్ ప్లాంట్‌కు వెళ్లే చెత్త **18** టన్నులు

ఐదుగురు ప్రత్యేకాధికారుల నియామకం

నగర వ్యాప్తంగా అన్ని డివిజన్ల నుంచి ప్రతి రోజూ 84 టన్నుల చెత్త వస్తుంటే జిందాల్ ప్లాంట్‌కు 18 టన్నులు మాత్రమే పంపించగలుగుతున్నారు. దీంతో డంపింగ్ యార్డులో చెత్త మేటవేసుకుపోతోంది. ఈ సమస్య పరిష్కరించాలంటే ఇంటి నుంచే చెత్త విభజన ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని నిర్ణయించారు. ఆ దిశగా క్షేత్రస్థాయి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఈ డ్రైవ్‌ను సమర్థంగా నిర్వహించాలన్న లక్ష్యంతో పది డివిజన్లకు ఒక ప్రత్యేకాధికారిని నియమించారు. 1 నుంచి 10 డివిజన్లకు జడ్పీ డిప్యూటీ సీఈవో ఆనంద్‌కుమార్, 11 నుంచి 20 డివిజన్లకు మార్కెటింగ్‌శాఖ ఏడీ ఎల్. నిత్యానందం, 21 నుంచి 30 డివిజన్లకు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి ఎన్. నరసింహులు, 31 నుంచి 40 డివిజన్లకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖాధికారి ఫణిదూర్జటి, 41 నుంచి 50 డివిజన్లకు జిల్లా బీసీ సంక్షేమశాఖాధికారి జి. రమేష్‌లను నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

అందరూ సహకరించాలి



నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఇంటి వద్దే చెత్త విభజన జరిగేలా ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. డివిజన్ల వారీగా నియమించిన ప్రత్యేకాధికారులు ప్రజలకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారు. ఇంటి వద్దే తడి, పొడి చెత్త విభజన చేసి సిబ్బందికి అందించేలా ప్రజలు అందరూ సహకరించాలి. డంపింగ్ యార్డులో చెత్తమేట కూడా పూర్తిగా తొలగించి శుభ్రం చేయించేందుకు కృషి చేస్తున్నాం. స్వచ్ఛ నగరం సాధనకు అందరూ కలిసిరావాలి.

- బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్

ప్రైవేటు మద్యం దుకాణాలు ప్రారంభం

కృత్తివెన్ను, న్యూస్‌టుడే: ప్రైవేటు మద్యం దుకాణాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. కృత్తివెన్ను మండలానికి మొత్తం నాలుగు మద్యం దుకాణాలకు అనుమతులు మంజూరవగా బుధవారం లక్ష్మీపురం, చినపాండ్రాక గ్రామాల్లో వాటిని ప్రారంభించారు. ఉదయం 10 నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మకాలు కొనసాగనున్నాయి. లక్ష్మీపురంలోని మద్యం దుకాణాన్ని తెదేపా మండల అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, జిల్లా కార్యదర్శి కూనసాని చిన్న, లక్ష్మీపురం, మాట్లం, గరిశపూడి సర్పంచులు పులగం సుబ్రహ్మణ్యం, తిరుమాని పాండురంగారావు, నాగిడి నాగార్జున తదితరులు ప్రారంభించారు.

రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నందమూరు వాసవీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రవాణాశాఖాధికారి మనీష పాల్గొని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలు, హెల్మెట్ ధరించాల్సిన ఆవశ్యకతను వివరించారు. అతివేగం ప్రమాదకరమన్న విషయాన్ని యువత గుర్తించుకోవాలని, ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని తెలిపారు. ఎంవీఐలు శ్రీనివాస్‌నాయక్, సిద్ధిఖీలు వివిధ అంశాలను వివరించారు. కళాశాల కరస్పాండెంట్ కె.కుమార బాబు, డైరెక్టర్ డి.బాబా, ప్రిన్సిపల్ బీఆర్ఎస్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపల్ డి.రాజారమేష్, ఆయా విభాగాల అధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్బన్ బ్యాంక్ సేవలు వినియోగించుకోండి



బ్యాంకును ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: అర్బన్ బ్యాంకు సేవలను మచిలీపట్నం ప్రజలు వినియోగించుకోవాలని మంత్రి కొల్లు రవీంద్ర కోరారు. మచిలీపట్నం జిల్లా పరిషత్ సెంటర్‌లో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన ది గుంటూరు కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంకును మంత్రి కొల్లు రవీంద్ర, ఆప్కోస్ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ గుంటూరు అర్బన్ బ్యాంక్ 75 ఏళ్లుగా వినియోగదారులకు సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఉమ్మడి కృష్ణా జిల్లా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ, జనసేన మచిలీపట్నం ఇన్‌ఛార్జి బండి రామకృష్ణ, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి ఛాయాదేవి, గోల్డ్‌ప్రిన్స్ అధినేత చలమలశెట్టి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య పరీక్షలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వృద్ధులకు వివిధ విభాగాల వైద్యులు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని పర్యవేక్షించిన రాష్ట్రీయ బాలస్వస్థ కార్యక్రమ నిర్వహణాధికారి డా. హిమబిందు మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి దశలవారీగా వివిధ విభాగాల వైద్యులతో వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. రక్తపరీక్షలు, ఈసీజీ, ఎకోతో పాటు అవసరమైన వారికి ప్రభుత్వ ఆస్పత్రిలో సీటీ, ఎమ్మారై స్కాన్ చేయించినట్లు పేర్కొన్నారు. వినికిడి పరికరాల పంపిణీకి పేర్లు నమోదు చేశామన్నారు.



వృద్ధాశ్రమంలో కంటి పరీక్షలు చేస్తూ..

కరాటేలో ఉత్తమ ప్రతిభ



విజేతలుగా నిలిచిన కొమ్మారెడ్డి విద్యార్థులు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: స్థానిక కొమ్మారెడ్డి హైస్కూల్ విద్యార్థులు కరాటే పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఇటీవల చెన్నైలో మవాతిక షిటోరియో కరాటే ఇంటర్నేషనల్ వారిచే నిర్వహించిన ఆల్ ఇండియా మవాతిక షిటోరియో ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్-2024 పోటీల్లో ఐదుగురు విద్యార్థులు పతకాలు సాధించారు. టి.లాస్య 14 ఏళ్లు, పి. యోక్షిత పదేళ్ల కటా విభాగంలో ప్రధాన స్థానాలు సాధించారు. ఎ.విష్ణు 11 ఏళ్లు, కె.హర్షిణి 9 ఏళ్లు, కె.నోహిత్ వైష్ణవ్ 8 ఏళ్ల కటా విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరితో పాటు కోచ్ వెంకటేశ్వరరావును పాఠశాల డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, స్కూల్ సెక్రటరీ కరెస్పాండెంట్ శోభ, హెచ్‌ఎం శ్రీనివాసరావు, తదితరులు అభినందించారు.

ఈ-క్రాప్ జాబితాల ప్రదర్శన

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో ఈ-క్రాప్ నమోదైన రైతుల వివరాల్ని గ్రామాల వారీగా సచివాలయాల్లో జాబితాల్ని ప్రదర్శిస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఏవో నూరున్నీసా తెలిపారు. జాబితాలో లోపాల్ని సవరించుకోవడానికి కొత్తగా నమోదుకు, తొలగింపులకు అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. రైతులు జాబితాల్ని సరిచూసుకోవాలని ఆమె కోరారు.

పోషకాహార కిట్ల పంపిణీ

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలోని జిల్లా క్షయ నివారణ కేంద్రంలో బుధవారం ముత్తూట్ ఫైనాన్స్, కారుణ్య యూత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో టీబీ చికిత్స తీసుకుంటున్నవారికి 50వేల విలువైన పోషకాహార కిట్లు పంపిణీ చేశారు. కారుణ్య యూత్ రూరల్ డవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షులు తూము మధుసూధనరావు, వైద్యాధికారి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో హరనాథ్

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ ఇందిరా కాలనీలోని ప్రాథమిక పాఠశాలను ఎంఈవో వైవీ హరనాథ్ బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థులు 73 మందికి 63 మంది హాజరవ్వడంపై ఉపాధ్యాయుల్ని ప్రశ్నించారు. హాజరు శాతాన్ని పెంచాలని సూచించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని, విద్యా సామర్థ్యాల్ని పరిశీలించారు. విద్యార్థులు అందరూ బడిలోనే భోజనం చేసే విధంగా చూడాలని తెలిపారు.

గృహాల చెంతకు.. సముద్రపు నీరు



కరఅగ్రహారం పంచాయతీ పరిధిలోని క్యాంప్‌బెల్‌పేటలో సముద్రపు నీరు నివాసాల చెంతకు చేరుతుండడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సముద్రపు పోటు సమయంలో నీరు ఇళ్ల వాకిళ్లలోకి చేరుతోందని వాపోతున్నారు. సముద్రపు నీటితో పాటు విషపు జీవులు కూడా ఇళ్లల్లోకి వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందున్న రహదారి లోతట్టు ప్రాంతం కావడంతో నీట మునుగుతోందని, రహదారిని మెరక చేసి సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. సముద్రపు నీరు చొచ్చుకుని రాకుండా ఉండేందుకు రివిట్‌మెంట్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

- కరఅగ్రహారం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే

కూటమి ప్రభుత్వంలో గ్రామ స్వరాజ్యం

మచిలీపట్నంరూరల్, న్యూస్‌టుడే: గ్రామ స్వరాజ్యానికి అసలైన అర్థాన్ని కూటమి ప్రభుత్వం చేతల్లో చూపిస్తోందని తెదేపా నేతలు పేర్కొన్నారు. పల్లెపండగలో భాగంగా బుధవారం బొర్రపోతుపాలెం, అరిశేపల్లి, సుల్తానగరం, కరఅగ్రహారం, చినఅగ్రహారం గ్రామాల్లో సీసీ రోడ్ల శంకుస్థాపన కార్యక్రమాల్లో తెదేపా నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెదేపా నేతలు మాట్లాడుతూ ఐదేళ్లుగా వెలవెలబోయిన గ్రామాలు నేడు జీవకళను సంతరించుకున్నాయన్నారు. వైకాపా ప్రభుత్వం పంచాయతీ నిధులు స్వాహా చేసి గ్రామాలను అభివృద్ధికి దూరం చేసిందని ఆరోపించారు. కార్యక్రమాల్లో తెదేపా నేతలు గోపు సత్యనారాయణ, కాగిత వెంకటేశ్వరరావు, కుంచె దుర్గాప్రసాద్(నాని), తలారి సోమశేఖర్, తెదేపా గ్రామ నేతలు నాగరాజు, నాగుల్‌మీరా, రామస్వామి, సునీల్, వనరాజు, వేముల శివాజీ, పంచకర్ల శివాజీ, అమ్మిరెడ్డి శివయ్య, పులి బసవయ్య, చండిక పాండురంగారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యం..

బంటుమిల్లి, న్యూస్‌టుడే: అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అన్నారు. రూ.21కోట్లతో పెడన నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మండలంలోని నాగేశ్వరరావుపేట, మల్లేశ్వరంలో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు జరిగాయి. నాగేశ్వరరావుపేటలో సర్పంచి తాత మహాలక్ష్మీ అధ్యక్షతన జరిగిన సచివాలయ, రైతు సేవా కేంద్రం నూతన భవనాల ప్రారంభోత్సవం, మల్లేశ్వరంలో సర్పంచి చెన్ను శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన సీసీ రోడ్లు, పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమాల్లో పెడన ఎమ్మెల్యే కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే సంక్షేమంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు దక్కుతుందన్నారు.

ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన మొదటి నెలలోనే పింఛన్లు పెంచామని తెలిపారు. అనంతరం ముంజులూరులో పట్టభద్రుల ఓటర్ల నమోదు కార్యక్రమంలో పాల్గొని వారి నుంచి దరఖాస్తులు స్వీకరించారు. మండల కన్వీనర్ కూనపురెడ్డి వీరబాబు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పంచకర్ల సురేష్, ఇల్లూరి లీలాకృష్ణ, బొర్రా కాశీ, తాతా రాజా, జొన్నలగడ్డ కొండ పాల్గొన్నారు.



క్యాంప్‌బెల్‌పేట: భూమిపూజలో తెదేపా నేతలు



అరిశేపల్లిలో సీసీ రోడ్డు శంకుస్థాపనలో తెదేపా నేతలు



మల్లేశ్వరంలో శిలాఫలకం ఆవిష్కరించిన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

44 గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశాలతో నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 44 గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సేకరించిన తాగునీటి నమూనాలకు గుడివాడ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా ఈఈ నటరాజ్ తెలిపారు. పరీక్షలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈనెల 17వ తేదీ సాయంత్రానికి పరీక్షల నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. గత మూడేళ్లుగా గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు ఎలాంటి మరమ్మతులకు నోచకపోవడం వలనే అవి పూర్తిగా పాడయ్యాయన్నారు. అందువల్ల మురికి నీరు సరఫరా అవుతోందన్నారు. వీటి మరమ్మతులకు సుమారు రూ.3.30 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు పంపామన్నారు.

సీఎన్‌జీ గ్యాస్ అందుబాటులో ఉంచాలి

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: నగరంలో సీఎన్‌జీ గ్యాస్ త్వరితగతిన అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకులు బూర సుబ్రహ్మణ్యం డిమాండ్ చేశారు. సీఎన్‌జీ గ్యాస్ కొరత సమస్య పరిష్కరించాలని కోరుతూ బుధవారం నగరంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మచిలీపట్నంలో సీఎన్‌జీ ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న 500 మంది కార్మికులు గత 15 రోజులుగా గ్యాస్ లేక ఉపాధి కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్యాస్ కోసం పెడన, గుడివాడ, నాగాయలంక, పామర్రు ప్రాంతాలకు వెళ్తున్నారన్నారు. 24 గంటల్లో గ్యాస్ అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు కరీముల్లా, షేక్‌బాజీ, రాజేష్ తదితరులతో పాటు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న నాయకులు, ఆటో డ్రైవర్లు

రేషన్ దుకాణంలో తనిఖీలు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరంలోని డ్రైవర్స్ కాలనీలోని 74వ నంబరు రేషన్ దుకాణంపై వచ్చిన ఫిర్యాదు మేరకు పీడీఎస్ డీటీ మహ్మద్‌సుభాన్‌బి బుధవారం తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా రికార్డుల్లో నమోదు చేసిన సరకు నిల్వల కంటే క్షేత్రస్థాయిలో 433 కేజీల బియ్యం, 12 పంచదార ప్యాకెట్లు తక్కువగా ఉన్నట్లుగా గుర్తించారు. దీంతో దుకాణాన్ని సీజ్ చేసి నిర్వాహకురాలు ఎం. సాయిమౌనికపై కేసు నమోదు చేసినట్లు మహ్మద్‌సుభాన్‌బి తెలిపారు. ఆమెతో పాటు ఆర్ఐ శేఖర్, వీఆర్వో ప్రణతి తనిఖీల్లో పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: చోరీ ఘటనపై చిలకలపూడి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీకి చెందిన విశ్రాంత వీఆర్వో భరత్‌రావు తన వ్యక్తిగత పనులపై ఇటీవల హైదరాబాద్ వెళ్లి బుధవారం ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలగొట్టి ఉన్నాయి. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎస్టీపీలకు మార్గం సుగమం

పెడనలో రూ.3.07కోట్లతో భూసేకరణ ప్రారంభం

న్యూస్‌టుడే, పెడన

పట్టణంలో మురుగు నీటి శుద్ధి కేంద్రాల(ఎస్టీపీ) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. మచిలీపట్నం ఎంపీ బాలశౌరి అన్నక్యాంటీన్ ప్రారంభోత్సవానికి పెడన వచ్చిన సమయంలో మూడు ఎస్టీపీల ఏర్పాటుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(సీఎస్ఆర్) నిధులు రూ.6కోట్లను విడుదల చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం పెడనలో అధికారులు పర్యటించి భూసేకరణ ప్రక్రియను ప్రారంభించారు. స్థానిక గుడివాడ రోడ్డులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా ఒక ఎస్టీపీ, మచిలీపట్నం రోడ్డులోని హోండా షోరూం వెనుక మరొక కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. కట్లపల్లిలో వర్షపు నీటిని శుద్ధి చేసి కాలువల్లోకి విడుదల చేసేందుకు మరో ఎస్టీపీ ఏర్పాటు చేయనున్నారు. ఈ మూడింటికి 1.77 ఎకరాల భూమి సేకరించాలని అంచనాలు రూపొందించి రూ.3.04 కోట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ కేటాయించింది. భూసేకరణ పూర్తయిన అనంతరం కార్పొరేషన్ ఎస్టీపీలను ఏర్పాటు చేస్తుంది.



మచిలీపట్నం రోడ్డులో ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అధికారుల పర్యటన

ఈ నేపథ్యంలో రెవెన్యూ, వ్యవసాయం, మున్సిపల్ శాఖల అధికారులు ఈ మూడు ప్రాంతాల్లో పర్యటించారు. రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. రైతులు అభ్యంతరం చెప్పకుంటే స్వచ్ఛంద భూసేకరణ చేస్తారు. లేకుంటే కంపల్సరీ సేకరణ చేస్తామని ఇన్‌ఛార్జి తహసీల్దార్ అనిల్ కుమార్ చెప్పారు. ఈ పర్యటనలో మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, ఇన్‌ఛార్జి ఏవో నూరున్నీసా, టీపీవో సృజనకుమారి, మండల, మున్సిపల్ సర్వేయర్లు దాసు, నాగరాజు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ పామర్తి జితేంద్ర పాల్గొన్నారు.

18న ధర్నా విజయవంతం చేయండి

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అపరిష్కృత, పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చేస్తున్న దశల వారీ పోరాటాల్లో ఈనెల 18న డీఈవో కార్యాలయం వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్‌రావు పిలుపు నిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె. చంద్రశేఖర్, కె. సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ సాయం ఏదీ!

పెడన, న్యూస్‌టుడే: పీఎం కిసాన్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం తమ బ్యాంకు ఖాతాలకు జమ కాలేదని పలువురు రైతులు బుధవారం ఇన్‌ఛార్జి ఏవో నూరున్నీసాకు కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. ఈ పథకం కింద ఇటీవల పలువురు రైతులకు ఎకరాకు రూ.2వేల వంతున ఆర్థిక సహాయం బ్యాంకు ఖాతాలకు జమైంది. ఈ మొత్తం తమకు జమ కాలేదని పేర్కొంటూ బుధవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. అయితే పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్ ప్రతులను జత చేసి కార్యాలయంలో అందజేయాలని, దీనిపై రికార్డులు పరిశీలించి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని ఏవో స్పష్టం చేశారు.

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

పల్లెసీమల అభ్యున్నతే లక్ష్యం



ఆకునూరులో భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్

ఉయ్యూరు(గ్రామీణం, న్యూస్‌టుడే : వైకాపా ఐదేళ్ల పాలనలో తీవ్ర నిర్లక్ష్యానికి గురైన పల్లె సీమలను అభివృద్ధి చేయాలనేది కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా ఆకునూరులో రూ.19 లక్షలు, గండిగుంటలో రూ.34 లక్షలు, చిన ఓగిరాలలో రూ.29 లక్షలు, పెద ఓగిరాలలో రూ.14.50 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులకు బుధవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో శేషగిరిరావు, ఉయ్యూరు నగర పంచాయతీ ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, సర్పంచులు గోలి వసంత్‌కుమార్(ఆకునూరు), వెనిగళ్ల శిరీష(చిన ఓగిరాల), గెత్తం అనుపమ(గండిగుంట), తిప్పురం లక్ష్మి(పెద ఓగిరాల), తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు దండమూడి చౌదరి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముప్పా రాజా, వెనిగళ్ల కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో అభివృద్ధి పండగ



ఆరుగొలనులో సీసీ రోడ్డు శంకుస్థాపనలో ఎమ్మెల్యే యార్లగడ్డ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడడంతో రాష్ట్రంలో అయిదేళ్ల తర్వాత అభివృద్ధి పండగ మొదలైందని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. ఉపాధి హామీ పథకాన్ని ఎలా దుర్వినియోగం చేయాలో మాజీ సీఎం జగన్ చూపిస్తే, ఎలా సద్వినియోగం చేయాలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చూపుతున్నారన్నారు. 'పల్లె పండగ' కార్యక్రమంలో భాగంగా బుధవారం చిరివాడ, ఆరుగొలను, కానుమోలు, పెరికీడు, కొయ్యూరు, బొమ్ములూరు, బాపులపాడు గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ప్రహరీలు, గోకులాలకు శంకుస్థాపనలు నిర్వహించారు. పలువురు సర్పంచులు, నాయకులు మూల్పూరి వెంకటరత్నం, చలమలశెట్టి రమేష్, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, మూల్పూరి కల్యాణి, బి.ప్రమీలారాణి, ఎ.శ్రీను, డి.శివన్నారాయణ, టి.బ్రహ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా

పోరంకి, న్యూస్‌టుడే: వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీ కమిషనర్ కార్యాలయం వద్ద పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని మున్సిపాలిటీ పారిశుద్ధ్య కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు యనమల సరళ, సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ.. మున్సిపాలిటీ నాలుగు క్లస్టర్లు పోరంకి, తాడిగడప, కానూరు, యనమలకుదురు సర్కిళ్లలో 400 మంది కార్మికులు పని చేస్తున్నారని, వారికి 2023 సమ్మెకాలం జీతాలు, సంక్రాంతి బోనస్, ఫిబ్రవరిలో హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని ప్రభుత్వం ఇచ్చిన జీవోని కూడా నాటి కమిషనర్‌కు ఇచ్చినా ఫలితం శూన్యమన్నారు.

★ **ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఆగ్రహం..** ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కార్మికుల ధర్నా వద్దకు వచ్చి కార్మికుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. అన్ని మున్సిపాలిటీలకు ఇచ్చి తాడిగడప మున్సిపాలిటీ కార్మికులకు ఎందుకు ఇవ్వలేదని సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను తక్షణం పరిష్కరించాలని కమిషనర్ భవాని ప్రసాద్‌కు సూచించారు. నాయకులు అనుమోలు ప్రభాకరరావు, షేక్ మస్తాన్‌వలి, మధిర ఏడుకొండలు, విజయ, సాంబశివరావు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలో ప్రతిభ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ప్రసాదంపాడులోని సెయింట్ ఆన్స్ స్కూల్‌కు చెందిన క్రీడాకారులు ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు సాధించారని ప్రధానోపాధ్యాయిని సిస్టర్ అరుణమేరీ తెలిపారు. తిరుపతిలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ పాఠశాలకు చెందిన ఎస్.నాగ వెంకట శ్రీనిధి అండర్-17 బాలికల విభాగంలో రజతం, ఎం.మాధవ్ బాలుర విభాగంలో కాంస్యం సొంతం చేసుకున్నారని పేర్కొన్నారు. బుధవారం పాఠశాలలో ఆ క్రీడాకారులను, కోచ్ అంకమ్మరావును ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

✦ హనుమాన్‌జంక్షన్‌లో ఎస్‌బీఐ దగ్గర నుంచి నారాయణ పాఠశాల వరకు డివైడర్‌లో గడ్డి దట్టంగా పెరిగి అధ్వానంగా తయారైంది. ఈ విషయాన్ని ఆ ప్రాంత వాసులు పంచాయతీ అధికారులకు నివేదించగా, స్పందించిన అధికారులు పారిశుద్ధ్య సిబ్బందిని వినియోగించి గడ్డి మొత్తాన్ని తొలగింపజేశారు.- న్యూస్‌టుడే, హనుమాన్‌జంక్షన్

✦ పోరంకి విష్ణుపురం కాలనీ రోడ్డులో చెట్ల కొమ్మలు వేలాడుతూ విద్యుత్తు తీగలకు అడ్డు వస్తున్నాయని నివాసితుడు పండమనేని సురేష్ 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా విద్యుత్తు శాఖాధికారి ఏఈ సాంబశివరావు దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి సిబ్బందిని పంపి కొమ్మలను కత్తిరించారు.

✦ పోరంకి పద్మనాభపురం కాలనీలో వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదని కాలనీ నివాసితులు పురపాలిక అధికారులు దృష్టికి తీసుకెళ్లగా.. కమిషనర్ భవాని ప్రసాద్ స్పందించి ఎలక్ట్రిషియన్లు నాగరాజు, దాసు సిబ్బందిని పంపి బాగు చేయించారు. - న్యూస్‌టుడే, పోరంకి

? పోరంకి సాయినగర్ పీవీఎస్ఆర్ స్కూల్ వద్ద డ్రైనేజీలో పూడిక తీయకపోవడం వల్ల దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం.
- కొల్లూరి శివశంకరరావు, పోరంకి

✔ పరిశీలించి సమస్య పరిష్కరిస్తాం.
- పి.భవానీ ప్రసాద్, కమిషనర్, తాడిగడప పురపాలక సంఘం

? యనమలకుదురు ఇందిరానగర్-2 ప్రాంతంలో కోతుల సమస్య ఎక్కువగా ఉంది. **- పద్మ, యనమలకుదురు**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- పి.భవానీ ప్రసాద్, తాడిగడప పురపాలక సంఘం కమిషనర్ - న్యూస్‌టుడే, కానూరు**

వైద్యానికి చేయూత



ఆర్థిక సాయం అందిస్తున్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

కానూరు, న్యూస్‌టుడే: పీవీపీ సిద్ధార్థ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 13 ఏళ్ల బాలుడికి ఆర్థిక సాయం అందించారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ శివాజీబాబు చేతుల మీదుగా ఇంగువగౌరీ అవినాష్‌కు రూ.60,250లు అందించారు. వైద్య ఖర్చుల నిమిత్తం కుటుంబ సభ్యులు ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సాయం అడగడంతో స్పందించి ఈ మొత్తాన్ని అందించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ బాధ్యులు శ్యామ్ పాల్గొన్నారు.

జూద శిబిరంపై దాడి

ఆటోనగర్: ఎనికేపాడులోని ఓ నివాసంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న జూద శిబిరంపై మంగళవారం పటమట, టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి దాడి చేశారు. జూదం ఆడుతున్న 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.2,65,000 నగదు స్వాధీనం చేసుకొని పటమట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై బుధవారం కేసు నమోదు చేశారు.

అభివృద్ధికి పట్టం.. పల్లెకు ఊతం

పల్లె పండగతో పంచాయతీలకు దండిగా నిధులు ☆ సకాలంలో పూర్తయితే ప్రగతి వెలుగులు

కంకిపాడు, పెనమలూరు, న్యూస్‌టుడే



వణుకూరు అంతర్గత రహదారి



కంకిపాడులో పూడిన కాల్వ

'పల్లె పండగ' పేరుతో గ్రామీణ ఉపాధి హామీ నిధులతో ప్రతిపాదిత, చేపట్టిన పనులు గ్రామ సీమల ప్రగతికి బాటలు వేయనున్నాయి. పెనమలూరు నియోజకవర్గంలోని మూడు మండలాల పరిధి గ్రామాల్లో(ఉయ్యూరు నగర పంచాయతీ, తాడిగడప నగరపాలిక మినహా) రూ.19.95 కోట్లతో 137 పనులకు పాలన, సాంకేతిక అనుమతి లభించింది. దీనిలో ప్రధానంగా సీసీ రహదారులు, డ్రెయిన్లు, ప్రహరీలు, గోకులాలు, షెల్టర్లు ఉన్నాయి. ఇవికాక 54 గోకులాలకు ప్రత్యేక నిధులు కేటాయించారు. గత ఆగస్టులో నిర్వహించిన గ్రామ సభల్లో వీటిని ఆమోదించడం విదితమే. ఆ తర్వాత మండల, జిల్లా పరిషత్‌ల తీర్మానం, కలెక్టర్ సిఫార్సు తదితర ప్రక్రియలు ముగిశాయి. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించిన విధంగా ఈ పనులు సత్వరమే చేపట్టి సంక్రాంతిలోగా పూర్తయితే పల్లెల రూపురేఖలు మారతాయి.

ప్రజాప్రతినిధుల ఆసక్తి..

గత ఐదేళ్లలో చేసిన పనులకు బిల్లులు రాక సర్పంచులు, గుత్తేదారులు అప్పుల పాలయ్యారు. కొందరు స్థిరాస్తులను తెగనమ్ముకున్న సందర్భాలున్నాయి. దీనికి భిన్నంగా 'నరేగా' పనులకు వెంటనే బిల్లుల మంజూరుపై ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం కంకిపాడులో జరిగిన 'పల్లె పండగ'లో హామీ ఇవ్వడం విదితమే. దీంతో పనులు చేపట్టడానికి ప్రజాప్రతినిధులు, గుత్తేదారులు ఆసక్తి ముందుకు వస్తున్నారు. ఇది మంచి పరిణామంగా భావిస్తున్నారు. 'కూటమి' ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో బకాయిలు రూ.13 కోట్లను చెల్లించడంతో బిల్లులు సకాలంలో వస్తాయనే నమ్మకం ఏర్పడింది.

✦ కంకిపాడు - 53 పనులకు నిధులు రూ.7.89 కోట్లు, పెనమలూరు - 46 పనులకు రూ.7.30 కోట్లు, ఉయ్యూరు - 38 పనులకు రూ.4.75 కోట్లు కేటాయించారు. ✦ ఇవికాక కంకిపాడు-20, పెనమలూరు-10, కంకిపాడు-24 గోకులాలకు రెండో విడత అనుమతి లభించింది. ✦ పైవన్నీ సామగ్రితో కూడుకున్నవి కాగా కూలీల ఉపాధి నిమిత్తం ఇంతే దాదాపు ఇదే మొత్తంలో నిధులు వినియోగించుకునే అవకాశం ఉంది. ఈ పనుల్లో పంట బోదెలు, కాల్వలు, ఊర చెరువుల బాగుజేత, ఇంకుడు, పంట గుంతల తవ్వకం, మొక్కలు నాటి సంరక్షించడం వంటి పనులున్నాయి.

పెనమలూరు నియోజకవర్గంలో ఆమోదిత పనులు, నిధుల కేటాయింపు ఇలా..(రూ.లక్షల్లో)

మండలం	సీసీ రహదారులు	నిధులు	డ్రెయిన్లు	నిధులు	ప్రహరీలు	నిధులు	మినీ గోకులాలు	నిధులు
కంకిపాడు	30	466	6	209	5	92	12	22.98
పెనమలూరు	31	525	8	181	2	18	5	6.07
ఉయ్యూరు	22	237	6	204	1	15	9	18.74

ఆదాయం పెంపు మార్గాలపై దృష్టి సారించండి

పెనమలూరు, న్యూస్‌టుడే: తాడిగడప పురపాలిక సంఘం ఆదాయం పెంపుపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అధికారులకు తెలిపారు. పురపాలిక అధికారులతో ఆయన బుధవారం ఎమ్మెల్యే కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కొత్తగా వేయవలసిన ఇంటి పన్నులపై దృష్టి పెట్టి పూర్తి చేయాల్సిందిగా కోరారు. ఇంటి పన్నులను సరిచేయడానికి సిబ్బందితో బృందాలను ఏర్పాటు చేయాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతపై రాజీ పడవద్దని ఆయన ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ప్రస్తుత పురపాలిక కార్యాలయాన్ని అన్ని వసతులున్న భవనంలోకి మార్చేందుకు పరిశీలించాలని అధికారులకు వివరించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ భవానీప్రసాద్, తెదేపా నేతలు అనుమోలు ప్రభాకరరావు, వడ్లమూడి శుభశేఖర్ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: విద్యుత్తు తీగల మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8.30 గంటల నుంచి 11.30 వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఉంటుందని గుణదల కార్యనిర్వహణ అధికారి హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. రామవరప్పాడులోని పటేల్‌నగర్, సాయినగర్, హనుమాన్ నగర్, టెంపుల్ ఏరియా, ఫ్లైఓవర్ కింద ప్రాంతం, రైల్వేస్టేషన్ కట్ట, బల్లెంవారి వీధి ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

పట్టభద్రుల ఓట్ల నమోదు

హనుమాన్‌జంక్షన్: గన్నవరం నియోజకవర్గ పరిధిలో ఉన్న పట్టభద్రులంతా తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని రాష్ట్ర తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి మూల్పూరి కల్యాణి విజ్ఞప్తి చేశారు. బుధవారం హనుమాన్‌జంక్షన్‌లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు నమోదు దరఖాస్తు ఫారంలు పంపిణీ చేశారు. ఇప్పటికే ఓటు నమోదు ప్రక్రియ మొదలైందని, ఓటు నమోదులో ఎలాంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని సూచించారు. నాయకులు వంశీ, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు గన్నవరం బాలుర జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన నాగకార్తిక్, డి.ప్రహర్ష విద్యార్థులు ఎంపికైనట్లు ఇన్‌ఛార్జ్ హెచ్ఎం పి.ఉమాదేవి బుధవారం తెలిపారు. విజయవాడ శివారు నున్నలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారని వెల్లడించారు. కార్యక్రమంలో పీడీ నాగరాజు, మీరాసాహెబ్ పాల్గొన్నారు.

ఐదో రోజు క్లాప్ డ్రైవర్ల సమ్మె

పోరంకి: తాడిగడప పురపాలిక పరిధిలో క్లాప్ డ్రైవర్ల సమ్మె ఐదు రోజులుగా కొనసాగుతుంది. గత మూడు నెలలుగా జీతాలందక అధికారులు, ప్రభుత్వం స్పందించక పోవడంతో కార్మికులు లబోదిబోమంటున్నారు. సమ్మెకు మద్దతుగా పురపాలిక సర్కిళ్లలోని పోరంకి, తాడిగడప, యనమలకుదురు, కానూరు మున్సిపాలిటీ కార్మికులు సంఘీభావం తెలిపారు. అన్నివర్గాల మద్దతు కూడగట్టి కార్మికులకు న్యాయం జరిగే వరకు పోరాడతామని సీఐటీయూ నాయకుడు ఉప్పాడ త్రిమూర్తులు, సీఐటీయూ పెనమలూరు మండల కమిటీ అధ్యక్షుడు మస్తాన్‌వలి, ప్రజా నాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ ఖాసీం, క్లాప్ డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నేరెళ్ళ, నరేంద్ర పేర్కొన్నారు.

మద్యం విక్రేతల అరెస్టు

గన్నవరం గ్రామీణం: గుట్టుచప్పుడు కాకుండా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఉంగుటూరు మండలం ఆత్కూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ముందస్తు సమాచారం మేరకు ఆత్కూరు గ్రామానికి చెందిన తొండ్రు ప్రసాద్, పాతపాటి నాగేంద్ర కుమార్‌లను తనిఖీ చేయగా వారి వద్ద నుంచి 19, 30 చొప్పున క్వార్టర్ మద్యం సీసాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ పేర్కొన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: ఉంగుటూరు మండలం నందమూరులో అనధికారికంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను బుధవారం పోలీసులు సీజ్ చేశారు. స్థానిక కూడలి వద్ద ట్రాక్టర్‌ను తనిఖీ చేయగా ఎటువంటి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. ట్రాక్టర్‌ను తహసీల్దార్ విమలకుమారి వద్ద హాజరుపర్చగా జరిమానా విధించినట్లు పోలీసులు వెల్లడించారు.

స్వచ్ఛతే సేవకు కదిలారు

ఈనాడు కథనాలకు స్పందన



గృహ నిర్మాణ కార్యాలయం ఎదుట పొదలను శుభ్రం చేసి..

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: మండల కేంద్రమైన బాపులపాడులో ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. మండల పరిషత్తు, వ్యవసాయ, స్త్రీ శక్తి, గృహ నిర్మాణ కార్యాలయాల చుట్టూ పరిసరాలు చెత్త, పొదలతో అధ్వానంగా తయారయ్యాయి. దీనిపై ఈనెల 15న 'స్వచ్ఛతే సేవ ఎక్కడ' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురించింది. స్పందించిన అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టి చెత్త తొలగించడంతో పాటు ఆవరణలు మొత్తం బుధవారం శుభ్రం చేయించారు.

చోడవరం, పెదపులిపాకల్లో ఎమ్మెల్యే బోడే పర్యటన నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: చోడవరం, పెదపులిపాక గ్రామాల్లో గురువారం ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పర్యటించనున్నారు. 'పల్లె పండగ' పనుల్లో భాగంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు.

కంకిపాడు గ్రామీణం: మండలంలోని కాసరనేనివారిపాలెంలో ఉదయం 8 గంటలకు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ పర్యటిస్తున్నట్లు కార్యాలయ సిబ్బంది ఒక ప్రకటనలో తెలిపారు.

అధిక యూరియా వినియోగంతో చేటు



పెనమలూరు: ఎరువుల యాజమాన్య పద్ధతులు వివరిస్తున్న శైలజ

చోడవరం (పెనమలూరు), న్యూస్‌టుడే: మోతాదుకు మించి యూరియా వినియోగించడం ద్వారా వరి పంటకు దోమపోటు సోకుతుందని మండల వ్యవసాయశాఖాధికారి కనకమేడల శైలజ తెలిపారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఈమె, వ్యవసాయ శాఖ సిబ్బందితో కలిసి చోడవరం, పెనమలూరు గ్రామాల్లోని వరి పొలాలను పరిశీలించారు. ఎరువుల యాజమాన్య పద్ధతులపై ఆమె రైతులకు సూచనలు ఇచ్చారు. యూరియా ప్రస్తుత దశలో పంటకు వినియోగించనవసరం లేదని పొటాష్ వినియోగించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది స్మైలీ, సుష్మ, అనూష తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు/గొడవర్రు (కంకిపాడు), న్యూస్‌టుడే : అల్పపీడనం, తుపాను, భారీ వర్షాల హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని వరి పైరు రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి కిరణ్ సూచించారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం మద్దూరు, గొడవర్రులో క్షేత్రస్థాయిలో పైరు పరిశీలించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. సాగునీటి యాజమాన్యంపై అవగాహన కల్పించారు. మోతాదుకు మించి ఎరువులను వాడకూడదని చెప్పారు.

కొత్త కొత్తగా ..



హనుమాన్‌జంక్షన్‌లో ఓ దుకాణం వద్ద మందుబాబులు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి కొత్త మద్యం దుకాణాలు ఏర్పాటు కావడంతో మండల వ్యాప్తంగా సందడి నెలకొంది. బుధవారం ఉదయం నుంచే పలుచోట్ల అమ్మకాలకు వీలుగా నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకున్నారు. సరకు రాకపోవడంతో కొంత నిరుత్సాహానికి గురయ్యారు. రాత్రికి సరకు రావడంతో పలు దుకాణాల వద్ద మందుబాబుల కోలాహలం కనిపించింది.

గన్నవరం గ్రామీణం: నూతన మద్యం పాలసీ రాష్ట్రంలో అమలులోకి వచ్చిన వేళ కొత్త దుకాణాలు ఒకటి రెండు మినహా ఇతర దుకాణాలు గన్నవరం, ఉంగుటూరు మండలాల్లో తెరుచుకోలేదు. లైసెన్స్‌లు పొందిన దుకాణదారుల్లో సాయంత్రం కేసరపల్లిలో ప్రారంభించారు. పాత దుకాణాల్లో మద్యం నిల్వలను సరిచూసి బేవరేజెస్ సంస్థకు అప్పగించాల్సి ఉన్నందున మరో రెండ్రోజుల సమయం పడుతుందని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. తెరుచుకున్న దుకాణాల్లోనూ ప్రముఖ బ్రాండ్ల మద్యం దర్శనమిస్తున్నాయని మందుబాబులు అభిప్రాయం వ్యక్తం చేశారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గన్నవరం గ్రామీణం: ఉంగుటూరు మండలం తేలప్రోలులో గొర్రెలు, మేకలలో నట్టల నివారణ మందును పశుసంవర్ధన శాఖ ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. పశువైద్యాధికారి డా.మల్లిబాబు నేతృత్వంలో చేపట్టిన కార్యక్రమంలో సర్పంచి లాం దిబోరా, తెదేపా నాయకుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెరువులను.. 'చెర'పట్టారు

✤ నిబంధనలు అతిక్రమించిన గత ప్రభుత్వం ✤ హైకోర్టు ఆదేశాలు బేఖాతరు



బాపులపాడు సూరమ్మ చెరువులో ఆరోగ్య కేంద్రం, ఆర్బీకేల నిర్మాణం



పెరికీడు తుమ్మలకుంట చెరువును పూడ్చి వేసి పేదల లేఔట్

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

కృష్ణాజిల్లాలోని గన్నవరం నియోజకవర్గంలో మూడు ప్రధాన మండలాల్లో కలిపి 80కు పైగా చెరువులున్నాయి. వేల ఎకరాల్లో వీటి విస్తీర్ణం ఉంది. ఇవన్నీ ఆయా గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపొందించడంతో పాటు, సాగు, వాడుక అవసరాలకు ఉపయోగపడేవి. గతంలో వీటిల్లో కొన్ని చోట్ల నివాసాలకు అనధికారికంగా కేటాయింపులు జరపడంతో పాటు, పొలాలకు సరిహద్దున ఉన్న చోట్ల సాగు భూములుగా మార్చేసుకున్నారు. దీంతో రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి, క్షేత్రస్థాయిలో విస్తీర్ణానికి పోలిక లేకుండా పోయింది. వైకాపా అధికారంలోకి వచ్చాక కంచె చేను మేసిన విధంగా శాశ్వత భవనాల నిర్మాణం, లేఔట్ల పేరుతో చెరువుల ఆక్రమణలకు ఊతమిచ్చింది.

పక్కా భవనాలు నిర్మించి..

✤ బాపులపాడు పరిధిలో ఉన్న బండివాని చెరువు, సూరమ్మ చెరువులో ఆర్బీకేలు, ఆరోగ్య క్లినిక్ భవనాల నిర్మాణం చేపట్టగా, కోడూరుపాడు పెద్దికుంట చెరువులో గ్రామ సచివాలయం, ఆర్బీకే, ఆరోగ్య క్లినిక్ భవనాల నిర్మాణాలకు వీలుగా శంకుస్థాపనలు చేశారు.

✤ వేలేరు చిన్నమల్లమ్మకుంట చెరువులో సహకార సంఘానికి అనుసంధానంగా బహుళ ప్రయోజన సేవా కేంద్రం(ఎంపీఎఫ్‌సీ) నిర్మించారు. ఇటీవల నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో రైతులు దీనిపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. గన్నవరం మండలం చిన్నఅవుటపల్లిలో చింత గుంట చెరువు దాదాపుగా కనుమరుగైపోయింది.

లేఔట్లు సైతం

✤ బాపులపాడు మండలం వీరవల్లిలో ఆర్.ఎస్.నంబరు 86లో 18.27 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కోమటికుంట చెరువును జగనన్న కాలనీ లేఔట్ వేసేందుకు దాదాపుగా పూడ్చి వేశారు. రైతులు హైకోర్టుకు వెళ్లడంతో ఆ ప్రక్రియ ఆపేసిన అధికారులు, ఆ తర్వాత బహుళ ప్రయోజన సేవా కేంద్రానికి కొంత భాగం కేటాయించడం గమనార్హం. ✤ బాపులపాడు మండలం కె.సీతారాంపురంలో ఆర్.ఎస్ నంబరు 465/2లో 43.06 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చింతాయగుంట చెరువు, పెరికీడులో 487/1లో 14.16 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న తుమ్మలకుంట చెరువులో జగనన్న లేఔట్లు వేసి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ✤ గన్నవరం మండలంలో 1,064 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బ్రహ్మయ్య లింగం చెరువులోనూ ఆక్రమణలు ఉన్నాయి. దీనికి అనుసంధానంగా 19 గొలుసుకట్టు చెరువులు ఉన్నాయి. చెరువులో ఆక్రమణలు నేటికీ పూర్తిగా తొలగించలేదు.

అధికారులు ప్రేక్షకపాత్ర

చెరువుల్ని పరిరక్షించాల్సిన నీటిపారుదల, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల అధికారులు ప్రేక్షకపాత్రకే పరిమితమయ్యారు. చెరువుల్లో ఆక్రమణలు నివారించేలా ఉమ్మడి హైకోర్టు 2007, ఫిబ్రవరిలో స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. దీంతో అప్పట్లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో చెరువులు అధికంగా ఉన్న నూజివీడు రెవెన్యూ డివిజన్ పరిధిలో న్యాయమూర్తుల బృందం పర్యటించి, ఆక్రమణల తీరు చూసి విస్తుపోయింది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులు అన్యాక్రాంతం కాకుండా పక్కాగా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

గుడివాడ
•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

పారిశ్రామిక, ఐటీరంగాల అభివృద్ధికి కృషి


చల్లపల్లి: రహదారులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్


నందివాడ: భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రావి తదితరులు


తోట్లవల్లూరు: భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా తదితరులు


ఘంటసాలపాలెంలో..

చల్లపల్లి, న్యూస్‌టుడే: దివిసీమకు ముఖ్య కేంద్రమైన చల్లపల్లిలో పారిశ్రామిక, ఐటీరంగాల అభివృద్ధికి కృషి చేస్తానని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. బుధవారం పల్లె పండుగలో భాగంగా చల్లపల్లి అగ్రహారంలో రూ.1.27 కోట్లతో చేపట్టిన సిమెంటు రోడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నాగాయలంక మండలం గుల్లలమోదకు మంజూరు చేసిన క్షిపణి పరీక్షకేంద్రం నిర్మాణం ప్రారంభమైతే దానికి అనుబంధంగా వచ్చే పరిశ్రమలు చల్లపల్లిలో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూముల్లో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. పల్లె పండుగలో అవనిగడ్డ నియోజకవర్గంలో రూ.30.68 కోట్లతో 496 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. చల్లపల్లి మండలంలో రూ.3,69,55,000లతో 59 సీసీరోడ్లు, అదనంగా మంజూరైన రూ.1,80,65,000లతో 31 సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు చెప్పారు. సర్పంచి పైడిపాముల కృష్ణకుమారి, యువనేత మండలి వెంకట్రామ్(రాజా), భాజపా నియోజకవర్గ కో-కన్వీనర్ తుంగల వెంకటగిరి, ఎంపీపీ కోట విజయరాధిక, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, తెదేపా నాయకులు యార్లగడ్డ శ్రీనివాసరావు, నిడమానూరి దిలీప్‌కుమార్, రావి చిట్టి, మోర్ల శివ, ఎంపీడీవో అనగాని వెంకటరమణ, పీఆర్ డీఈఈ పగడాల సురేష్‌బాబు, ఏఈఈ బొప్పన శ్రీనివాసరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నందివాడ(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: నందివాడ మండలంలో పెదలింగాల, చినలింగాల, పుట్టగుంట గ్రామాల్లో రూ.25 లక్షలతో చేపట్టనున్న సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము.. మాజీ ఎమ్మెల్యే రావితో కలిసి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన వసతులు, సదుపాయాలు, అభివృద్ధిని అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని అన్నారు. అర్బన్‌బ్యాంక్ మాజీ ఛైర్మన్ పిన్నమనేని బాబ్జి, చేకూరి జగన్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసీమలకు మహర్దశ

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: గ్రామీణాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. పల్లె పండగలో భాగంగా మండలంలోని యాకమూరులో రూ.14 లక్షలు, పెనమకూరు గ్రామంలో రూ.40 లక్షలు, తోట్లవల్లూరులో రూ.59 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు బుధవారం శంకుస్థాపన చేశారు. మండల తెదేపా అధ్యక్షుడు వీరపనేని శివరామప్రసాద్, బీసీఫెడరేషన్ తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వి గురుమూర్తి, సుబ్రహ్మణ్యం, రాంబాబు, జనసేన నాయకులు తాడిశెట్టి నరేష్, కృష్ణసుమన్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మకూరు(పామర్రు గ్రామీణం): నిమ్మకూరు జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణానికి ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ శంకుస్థాపన చేశారు.


నిమ్మకూరు: ప్రహరీ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎంపీపీ అశోక్‌కుమార్

ఘంటసాల: ఘంటసాలపాలెంలో రూ.13.50 లక్షలు వ్యయంతో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచి దోనె రజని, తెదేపా మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, తెదేపా నాయకుడు వేమూరి సాయి వెంకటరమణ, ఈవో బోలెం అర్జునరావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. అచ్చెంపాలెంలో రూ.8లక్షలు నిధులతో సీసీ రోడ్ల నిర్మాణానికి, రూ.9.9 లక్షలతో 5 మినీ గోకులాల నిర్మాణాలకు సర్పంచి గాజుల నాగశ్రీనివాసరావు, ఈవో ఆర్ శ్రీనివాసరావు భూమిపూజ చేశారు. చినకళ్లేపల్లిలో రూ.12.50 లక్షల వ్యయంతో రెండు సీసీ రోడ్ల నిర్మాణాలకు సర్పంచి రాము, ఈవో అబ్దుల్ నయీమ్ శంకుస్థాపన చేశారు.


అచ్చెంపాలెంలో...


చినకళ్లేపల్లిలో...

18న ఉచిత వైద్య సేవలు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడిలోని రవిప్రకాష్ సిలికాన్‌ఆంధ్ర సంజీవని వైద్యాలయం ఆరో వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం రోగులకు పూర్తిగా ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామని ఆసుపత్రి ఏవో హనుమకుమార్ తెలిపారు. ఓపీ ఫీజుతో పాటు డాక్టర్ ఫీజు, రక్త పరీక్షలు, ఎక్స్‌రే, మందులు కూడా ఉచితంగా అందిస్తున్నామన్నారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జనరల్ మెడిసిన్ విభాగం, జనరల్ సర్జరీ విభాగం, మగవారి వ్యాధి విభాగం, గైనకాలజీ(స్త్రీల) విభాగం, చిన్న పిల్లల వైద్యవిభాగం సేవలను సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయని, మధ్యాహ్నం 2 గంటల నుంచి ఎముకలు, కీళ్ల విభాగం, చర్మవ్యాధుల విభాగం, చెవి, ముక్కు, గొంతు విభాగం, నరాల వైద్యవిభాగం వంటి సేవలు సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. సర్జరీలకు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా చేయనున్నట్లుగా ఏవో వివరించారు.

దారులు ఇలా.. ప్రయాణం ఎలా?


కూచిపూడి నుంచి మొవ్వ వెళ్లే ప్రధాన రోడ్డుపై నీరు

అవనిగడ్డ గ్రామీణం, కూచిపూడి, న్యూస్‌టుడే

గత ఐదేళ్ల వైకాపా పాలనలో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కనీసం మరమ్మతులు కూడా నిర్వహించలేదు. దీంతో ప్రజలకు కష్టాలు తప్పలేదు. తాజాగా అల్పపీడన ప్రభావానికి కురుస్తున్న వర్షాలకు నరకాన్ని తలపిస్తున్నాయి.


అశ్వారావుపాలెం సమీపంలో...

ఇదీ పరిస్థితి

☛ అవనిగడ్డ-అశ్వారావుపాలెం ప్రధాన రహదారిపై అడుగుకో గుంత ఉండడంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. రామచంద్రపురంలో బుధవారం మధ్యాహ్నం కురిసిన కుండపోత వర్షానికి ప్రధాన రహదారితో పాటు మలుపు వద్ద భారీగా నీరు చేరింది.


అవనిగడ్డ- అశ్వారావుపాలెం మార్గంలో లంకమ్మమాన్య కాలనీ సమీపంలో..

☛ మొవ్వ మండలంలో వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. గుంతల్లో వర్షపునీరు నిల్వ ఉండడంతో రాకపోకలు సాగించేందుకు వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో నిల్వ ఉన్న మురుగు నీటిని పంచాయతీ సిబ్బంది బయటకు పంపే ఏర్పాట్లు చేయాలని ప్రజలు కోరుతున్నారు. మొవ్వ మండలం అయ్యంకి నుంచి పెదపూడి మీదుగా కూచిపూడి, మొవ్వ వరకు ప్రయాణం నరకప్రాయంగా మారింది. ఆయా ప్రాంతాల్లో ఇటీవల గుంతలు పూడ్చినా ఈ వర్షాలకు మళ్లీ మామూలు స్థితికి వచ్చాయి. మొవ్వ నుంచి పెదముత్తేవి, కూచిపూడి నుంచి బార్లపూడి మీదుగా భట్లపెనుమర్రు వెళ్లే మార్గాల్లో పెద్ద అగాధాలు ఏర్పడ్డాయి. వర్షం తగ్గిన వెంటనే రహదారులకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

44 గ్రామాల్లో తాగునీటి పరీక్షలు

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశాలతో నియోజకవర్గంలోని గుడివాడ, నందివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 44 గ్రామాల్లో గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు సేకరించిన తాగునీటి నమూనాలకు గుడివాడ ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్నట్లు గ్రామీణ నీటి సరఫరా ఈఈ నటరాజ్ తెలిపారు. పరీక్షలను బుధవారం ఆయన పరిశీలించారు. ఈనెల 17వ తేదీ సాయంత్రానికి పరీక్షల నివేదికలు ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. గత మూడేళ్లుగా గ్రామాల్లో ఫిల్టర్ బెడ్‌లు ఎలాంటి మరమ్మతులకు నోచకపోవడం వలనే అవి పూర్తిగా పాడయ్యాయన్నారు. అందువల్ల మురికి నీరు సరఫరా అవుతోందన్నారు. వీటి మరమ్మతులకు సుమారు రూ.3.30 కోట్లు ఖర్చు అవుతుందని ప్రతిపాదనలు తయారు చేసి అధికారులకు పంపామన్నారు.


నమూనాలు పరీక్షిస్తున్న సిబ్బంది

జూనియర్ కళాశాలలో ప్రత్యేక తరగతులు ప్రారంభం


హాజరైన విద్యార్థినులు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల పనివేళలు మార్పు చేస్తూ జారీ చేసిన ఆదేశాలు బుధవారం నుంచి అమలులోకి వచ్చాయి. ఇందులో భాగంగా మొవ్వ క్షేత్రయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 వరకు రెగ్యులర్, 4 నుంచి 5గంటల వరకు ప్రతి గ్రూప్‌లో ప్రత్యేక తరగతులు(ఇంటెన్సీవ్ కోచింగ్)కు శ్రీకారం చుట్టారు. ఇంటర్ పరీక్ష ఫలితాలు ఆశించిన రీతిలో పొందేలా సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నట్లుగా కళాశాల ప్రిన్సిపల్ ప్రసాద్ శాస్త్రి తెలిపారు. అధ్యాపకులు డి.సుధాకరరావు, కె.మహేష్, ఆశాకాంతి, టి.శ్రీనివాస్, మాధవి, రేఖ, ఎ.వాసుబాబు, కె.రంగనాయకులు, ఆనంద్ లక్ష్మీనారాయణలు ఆయా సబ్జెక్టులపై ప్రత్యేక తరగతులు నిర్వహించారు.

పల్లెపండగ వారోత్సవాలు విజయవంతం చేయండి

పెదపారుపూడి న్యూస్‌టుడే: ఈనెల 17 నుంచి 25 వరకు నిర్వహించే పల్లెపండగ వారోత్సవాలు విజయవంతం చేయాలని ఎంపీడీవో సీతామహాలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. 17వ తేదీన ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా వానపాముల, వెంట్రప్రగడ, కొర్నిపాడు గ్రామాల్లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

టేకుపల్లి(మోపిదేవి), న్యూస్‌టుడే: టేకుపల్లిలో కంచికామకోటి పీఠస్థ బాలపార్వతీ సమేత రామేశ్వరస్వామి (స్వయంభు) ఆలయంలో శరన్నవరాత్ర, ఆశ్వయుజమాసం పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం అమ్మవారికి హరిద్రా మూలాలతో అలంకరణ చేశారు. ఆలయ స్థానాచార్యులు లంక ప్రసాద్ ఆలయ అర్చకులు పిల్లలమర్రి శాస్త్రి ప్రత్యేక పూజలు, లలితా సహస్రనామ అర్చనలు, ఖడ్గమాల, తదితర పూజా కార్యక్రమాలు చేశారు.

భక్తితో ఇరుముడులు

మొవ్వ(కూచిపూడి), న్యూస్‌టుడే: మొవ్వ శ్రీ మేశ్వరాలయంలో అయ్యప్ప దీక్షాధారులు ఇరుముడుల కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మొవ్వ, కోసూరు, గూడపాడు, కొండవరం తదితర ప్రాంతాలకు చెందిన భక్తులు 41 రోజుల దీక్ష ముగించుకుని గురుస్వామి ప్రసాద్ ఆధ్వర్యంలో 55 మంది మాలధారులకు ఇరుముడులు కట్టారు. దీక్షాదారులతో పాటు మరో 30 మంది భక్తులు కలిసి శబరిమలకు బయలుదేరారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

దుర్గాదేవి గ్రామోత్సవం

మోపిదేవి, న్యూస్‌టుడే: మోపిదేవి బస్టాండు వెనుక 7 వార్డులో 13 రోజులుగా పూజలందుకున్న దుర్గాదేవి గ్రామోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని కృష్ణానదిలో నిమజ్జనోత్సవం చేశారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

అవనిగడ్డ, న్యూస్‌టుడే: అవనిగడ్డ తహసీల్దార్‌గా కె.నాగమల్లేశ్వరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సమయంలో ఆయన అవనిగడ్డ తహసీల్దార్‌గా పని చేసి అనంతరం జరిగిన బదిలీల్లో గుంటూరు వెళ్లారు. ఇటీవల తహసీల్దార్‌గా పనిచేసిన సునీల్ కుమార్ ఇక్కడి నుంచి బదిలీ కావడంతో తిరిగి నాగమల్లేశ్వరరావు అవనిగడ్డకు వచ్చారు. సిబ్బంది ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

ఓటరు నమోదు కేంద్రం ప్రారంభం


దరఖాస్తులు ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో బుధవారం పట్టభద్రుల ఓటరు నమోదు కేంద్రాన్ని జిల్లా యూటీఎఫ్ అధ్యక్షుడు బి.కనకారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2021 సంవత్సరం నాటికి పట్టభద్రులైన వారు అర్హులని, నవంబరు 6వ తేదీ లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అవనిగడ్డ, కోడూరు మండల సంఘం అధ్యక్షులు కె.జీవేంద్రరావు, కె.అశోక్, మోపిదేవి మండల ప్రధాన కార్యదర్శి ఎన్.ఎన్.స్వామి, అవనిగడ్డ సంఘ గౌరవాధ్యక్షుడు పీవీ.ఆంజనేయులు, జిల్లా కౌన్సిలర్ కె.రాజశేఖర్, పాల్గొన్నారు.

తోట్లవల్లూరు, న్యూస్‌టుడే: త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పట్టభద్రులంతా ఓటర్లుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎం.కుసుమకుమారి కోరారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో ఫారం-18 పూర్తి చేసి, విద్యార్హత ధ్రువపత్రాల నకలుపై గెజిటెడ్ అధికారితో సంతకం చేయించి సమర్పించాలన్నారు. నవంబరు 6లోపు ఓటు నమోదు చేసుకువాలని కోరారు.

మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దు

ఘంటసాల, అవనిగడ్డ, న్యూస్‌టుడే: ఘంటసాలలో ఇళ్ల మధ్యలో మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వొద్దని పలువురు బుధవారం తహసీల్దారు విజయప్రసాద్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఘంటసాల సత్రం సెంటర్ సమీపంలో మద్యం దుకాణంతో పాటు రోడ్డు పక్కన చేపలు అమ్మడంతో రోడ్డువెంట నడవాలంటే మందుబాబుల ఆగడాలతో భయమేస్తోందని పలువురు మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామస్థులు బాషా, సతీష్, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, లక్ష్మి, వెంకటేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దారు విజయప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కరాటే పోటీల్లో ప్రతిభ

పామర్రు, న్యూస్‌టుడే: ఈ నెల 6న చెన్నైలో జరిగిన జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో పామర్రుకు చెందిన ఏఎన్ఎం హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చాటారని ప్రిన్సిపల్ ఎ.పూర్ణచంద్రారెడ్డి బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ అండర్-14 బాలుర, బాలికల కటా విభాగంలో ఎం.పవన్‌కుమార్, ఎ.రాకేష్, డి.భువనశ్రీజ, మణికంఠ, సాయికార్తికేయలు ద్వితీయ, వి.రోహిత్ తృతీయ స్థానంలో గెలుపొందారన్నారు. విజేతలకు, శిక్షణ ఇచ్చిన కరాటే కోచ్ వీవీఎస్ రామకృష్ణను బుధవారం పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ పూర్ణచంద్రారెడ్డి

రెండు టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక ఒకటో వార్డు లంస బేకరీ సమీపంలో ఆటోలో తరలిస్తున్న రెండు టన్నుల రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు పట్టుకున్నారు. బియ్యం తరలిస్తున్న కోసూరు రాజారావు పరారు కాగా, డ్రైవరును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసరావు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు సొంతగూడు

తెదేపా నేతల హామీతో దిగివచ్చిన గుత్తేదారు
నేడు మంత్రులతో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ భవనం ప్రారంభం

కొతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే

గుత్తేదారుడు ఆ ప్రభుత్వ కార్యాలయ భవనం నిర్మించి నాలుగేళ్లయ్యింది. గత వైకాపా ప్రభుత్వం సగం నిధులు మంజూరు చేయకపోవడంతో అతడు ఆ భవనానికి తాళాలు వేసుకుని తన వద్దే ఉంచుకున్నాడు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, తెదేపా నేతలు హామీ ఇవ్వడంతో గుత్తేదారుడు భవనానికి తాళాలు తీశాడు. ఇంకేముంది 14 ఏళ్లుగా ఇరుకు అద్దె భవనంలో నిర్వహిస్తున్న కార్యాలయం గురువారం సొంత గూటికి వెళ్లనుంది. రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యింది.

మండలంలోని కౌతవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం 1900 సంవత్సరంలో ఏర్పాటు చేయగా.. తొలుత అద్దె భవనాల్లో నిర్వహించారు. 1923లో బ్రిటిష్‌వారు భవనం నిర్మించారు. కొన్నాళ్లకు అది మరమ్మతులకు గురై శ్లాబ్ దెబ్బతింది. వర్షాలు కురుస్తుండడంతో రికార్డులు తడిసి సిబ్బంది విధులకు కష్టంగా మారింది. దీంతో 2010లో కార్యాలయాన్ని గ్రామంలోని అద్దె భవనంలోకి చేర్చగా.. నాటి నుంచి ఇప్పటి వరకు అద్దె భవనంలో కొనసాగుతోంది.


నాలుగేళ్లుగా నిర్మించి వదిలేసిన భవనం

తెదేపా హయాంలో రూ.23 లక్షలు మంజూరు

2019లో తెదేపా ప్రభుత్వం రెవెన్యూ నిధుల నుంచి ప్రత్యేకంగా రూ.23 లక్షలు మంజూరు చేసింది. టెండర్లు పిలిచి సాంకేతిక ఆమోదం లభించేసరికి వైకాపా ప్రభుత్వం వచ్చేసింది. గుత్తేదారుడు 2020లో పనులు చేపట్టి 6 నెలల్లో పూర్తి చేశాడు. కానీ కేవలం రూ.10 లక్షలు మాత్రమే బిల్లు చెల్లించడం, మిగిలిన మొత్తం ఇవ్వకపోవడంతో జగన్ ప్రభుత్వంపై నమ్మకం లేక గుత్తేదారు ఆ భవనానికి తాళాలు వేసి తనకు పూర్తి బిల్లు చెల్లిస్తేనే భవనం అప్పగిస్తానని స్పష్టం చేశాడు. అప్పటిలో అధికారులు కూడా ఈ సమస్యను పట్టించుకోకపోవడంతో భవనం వృథాగా మారింది. కూటమి ప్రభుత్వం రావడంతో స్థానిక తెదేపా నేత మల్లిపెద్ది సుబ్రహ్మణ్య చౌదరి దీనిపై చొరవ చూపారు. గుత్తేదారుడు మానికొండ ఆంజనేయులుతో పలుసార్లు చర్చించారు. నిధులు విడుదల చేయిస్తానని హామీ ఇవ్వడంతో గుత్తేదారుడు తాళాలు అందజేశారు. గురువారం మంత్రులు అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్రలు పాల్గొని ఈ భవనాన్ని, అలాగే స్థానిక సొసైటీ నిధులతో నిర్మించిన పెట్రోల్ బంక్‌ను ప్రారంభించనున్నట్లు మల్లిపెద్ది వెల్లడించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

గుడివాడ గ్రామీణం: నియోజకవర్గంలోని 44 గ్రామాల్లో చాలా కాలంగా తాగునీటి సమస్య ఉందని గత ప్రభుత్వం దానిని పట్టించుకోలేదని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజ్ఞప్తి చేయగానే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చర్యలు తీసుకోవడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలుపుతున్నామని జనసేన బాధ్యుడు బూరగడ్డ శ్రీకాంత్ తెలిపారు. ప్రజలు కలుషిత నీరు తాగడం వల్ల చాలా రకాలుగా అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆ సమస్యను నీటి బాటిళ్లతో ఎమ్మెల్యే రాము పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లడం వల్ల నేడు గ్రామాల్లో ఫిల్టర్ బెడ్లకు మహర్దశ రానుందని అన్నారు.

ఉపాధ్యాయ సమస్యలపై 18న ధర్నా

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అపరిష్కృత, పురపాలక ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ చేస్తున్న దశల వారీ పోరాటాల్లో ఈనెల 18న డీఈవో కార్యాలయం వద్ద జరిగే ధర్నా విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు నీలం ప్రభాకర్ రావు పిలుపునిచ్చారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు కె.చంద్రశేఖర్, కె.సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతుల వివరాల ప్రదర్శన

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: మండలంలో పంటల సాగు చేస్తున్న రైతుల వివరాలను మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల వద్ద అధికారులు ప్రదర్శించారు. మొత్తం మండలంలో 22,102 ఎకరాల్లో సాగుచేస్తున్న రైతుల వివరాలను ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఆయా వివరాలు, తమ పేర్లు జాబితాలో ఉన్నాయే లేవో రైతులు చూసుకుని అభ్యంతరాలను గురువారం లోపు తెలియాల్సి ఉంది. తుది జాబితాను 18వ తేదీన ప్రదర్శించనున్నారు.

అందుబాటులో జాబితాలు

మోపిదేవి, న్యూస్‌టుడే: రైతు సేవా కేంద్రాల్లో ఈ క్రాప్ నమోదు జాబితాలను అందుబాటులో ఉంచినట్లు వ్యవసాయశాఖ మండల అధికారిణి హెప్సిబారాణి బుధవారం తెలిపారు. ఈ క్రాపులో పేరు ఉందా లేదా అని చూసుకోవాలని పంట నమోదును సరిచూసుకోవాలని ఆమె కోరారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు.

? స్థానిక పాత స్టేట్ బ్యాంకు ముందు బజారు రహదారి పూర్తిగా దెబ్బతింది. వాహనదారులు పాదచారులు ఇబ్బందులు పడుతున్నారు. - **కె.అజయ్, పామర్రు**

✔ పంచాయతీలో నిధుల లభ్యతను బట్టి రహదారి నిర్మాణం చేపడతాం. - **సలీమ్, కార్యదర్శి**

? స్థానిక శాఖా గ్రంథాలయం సమీపంలో చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోంది. - **అబ్దుల్ ఆరీఫ్, పామర్రు**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్తను తొలగించి సంపద కేంద్రానికి తరలిస్తాం. - **సుధాకరరావు, శానిటరి ఇన్‌స్పెక్టర్**

? తలగడ దీవి శివారు ఎస్సీ కాలనీలో ప్రధాన రహదారిపై గుంత పడింది. ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. - **వాహనదారులు**

✔ నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తాం. నిధులు మంజూరవగానే సమస్య పరిష్కరిస్తాం.
- **ఎ.రమేష్, ఆర్‌అండ్‌బీ డీఈఈ, అవనిగడ్డ**

– పామర్రు, అవనిగడ్డ, న్యూస్‌టుడే

హనుమాన్‌చాలీసా పారాయణం

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలోని సువర్చలా సమేత ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో చిట్టా ప్రసాద్ ఆధ్వర్యంలో చేపట్టిన 108 రోజులు..రోజుకు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమానికి ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై పూజలు చేశారు. లోక కల్యాణార్థం, దివిసీమ సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తూ చిట్టా ప్రసాద్ చేపట్టిన కార్యక్రమం జయప్రదం కావాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం భక్తబృందం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీనివాసరావు తొలుత ఎమ్మెల్యేకు స్వాగతం పలికి సత్కరించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, అల్లుడు శీలం అశ్విన్‌కుమార్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జలదీశ్వరుడికి వెండి ఆభరణాల బహూకరణ

ఘంటసాల, న్యూస్‌టుడే: ఘంటసాలలో బాలపార్వతీ సమేత జలదీశ్వరస్వామి ఆలయానికి రూ.42వేలు విలువైన వెండి కిరీటం, వెండి వస్తువులను వ్యవసాయ శాఖ ఏఈవో ఆరాధ్యుల అంకమరావు దంపతులు బుధవారం అందజేశారు. రుత్వికులు చావలి కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు గొర్రెపాటి వెంకట రామకృష్ణ, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు బండి పరాత్పరరావు, విశ్రాంత వీఆర్వో నిడుమోలు భద్రిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి-విజయవాడ రహదారిలోని ప్రసన్న భక్తాంజనేయ స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వేమూరి శ్రీనివాసశర్మ ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. చల్లపల్లి, మోపిదేవి ఎస్ఐలు పి.ఎస్.వి.సుబ్రహ్మణ్యం, సత్యనారాయణ స్వామివారిని దర్శించుకున్నారు.

వరద బాధితులకు అక్కినేని కళాశాల సాయం

గుడివాడ గ్రామీణం, న్యూస్‌టుడే: వరద బాధితుల సహాయార్థం గుడివాడ అక్కినేని నాగేశ్వరరావు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు అందించిన రూ.1.16 లక్షల చెక్కును రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు బుధవారం అందజేశారు. కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కాట్రగడ్డ సిహాంద్రి అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ పీజేఎస్ కుమార్‌లు పాల్గొన్నారు.


రూ.1.16 లక్షల చెక్కు అందిస్తున్న అక్కినేని కళాశాల పాలకవర్గం

మనకోసం మనం ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

చల్లపల్లి, న్యూస్‌టుడే: స్వచ్ఛ సుందర చల్లపల్లి అభివృద్ధి, సుందరీకరణ పనుల కోసం మనకోసం మనం ట్రస్ట్‌కు కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి గోపీచంద్ రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. బుధవారం స్వచ్ఛ చల్లపల్లి రథసారథి డాక్టర్ డి.ఆర్.కె.ప్రసాద్‌ను కలిసి చెక్కును అందించారు. మిత్రబృందం దిలీప్, బసవశంకరరావు పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధికి దాతల సహకారం అవసరం


ప్లాంట్ ప్రారంభిస్తున్న వర్ల కుమారరాజా


అడ్డాడ: గదిని ప్రారంభిస్తున్న కరెస్పాండెంట్ నాగార్జునరాజు

హనుమంతపురం(పమిడిముక్కల), న్యూస్‌టుడే: గ్రామాభివృద్ధి విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకుతోడు దాతల సహకారం కూడా ఎంతో అవసరమని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమారరాజా అన్నారు. హనుమంతపురంలో లింగమనేని యూత్ ఆధ్వర్యంలో మండవ సుబ్బారావు జ్ఞాపకార్థం వారి కుమారుడు మండవ వెంకటేశ్వరరావు, మనుమడు లింగమనేని వెంకట్రామయ్యల ఆర్థిక సాయం రూ.13 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం వర్ల ప్రారంభించారు. ఎంపీటీసీ మాజీ సభ్యుడు లింగమనేని బాబూరావు తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అడ్డాడ(పామర్రు గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని అడ్డాడ శ్రీఅరవింద విజ్ఞాన విహార పాఠశాలకు దాతలు రాజువేసేసిన, జయప్రద ఫౌండేషన్ సంయుక్తంగా ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేశారు. బుధవారం పాఠశాల కరస్పాండెంట్ ఎ.నాగార్జునరాజు, అకాడమిక్ సలహాదారు పి.సూర్యనారాయణమూర్తిలు ప్రారంభించారు. దాతలకు ప్రిన్సిపల్ ఎస్.రమణమూర్తి, సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.



ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి చెక్కు అందజేస్తున్న రామకృష్ణ, మురళీమోహనరావు తదితరులు

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం

విజయవాడ (సత్యనారాయణపురం), న్యూస్‌టుడే : ఇటీవల విజయవాడ బుడమేరు వరదల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు వాకర్స్ ఇంటర్నేషనల్ తరపున ఉమ్మడి కృష్ణా జిల్లా వాకర్స్ గవర్నర్, న్యాయవాది చిన్నం రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం సచివాలయంలోని ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి.. వాకర్స్‌ను అభినందించారని రామకృష్ణ తెలిపారు. ప్రజల ఆరోగ్యం రీత్యా రాష్ట్రంలోని అన్ని కళాశాలలు, పాఠశాలల్లోని మైదానాల్లో వాకింగ్‌కు ఏర్పాట్లు చేసి, అనుమతులు మంజూరు చేయాలని సీఎంకు వినతి పత్రం ఇచ్చినట్లు ఆయన తెలిపారు. చంద్రబాబు స్పందించి, దీనికి సంబంధించి త్వరలోనే తగు ఉత్తర్వులు జారీచేస్తామని హామీ ఇచ్చారన్నారు. ముఖ్యమంత్రిని కలిసిన వారిలో ఇంటర్నేషనల్ వాకర్స్ అధ్యక్షుడు మురళీమోహనరావు, రావి కృష్ణారావు, సూరిబాబు, మురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

పట్టభద్రుల ఓటుందా..?

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే

సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి కదా.. మళ్లీ ఓట్లేంటీ అని అనుకుంటున్నారా... అవును. ఈ సారి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల వంతు వచ్చింది. డిగ్రీ పూర్తిచేసిన వారే ఓటు వేయాలి. ఎలా నమోదు చేసుకోవాలి? దానికి ఏయే పత్రాలు అవసరమవుతాయి? ఆన్‌లైన్ ప్రక్రియ ఎలా ఉంటుంది... తదితర విషయాలు తెలుసుకుందాం.


ప్రస్తుతం ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కె.ఎస్.లక్ష్మణరావు ఉన్నారు. ఆయన గడువు వచ్చే ఏడాది మార్చి 29తో ముగుస్తుంది. ఈలోపు కొత్తవారి ఎన్నికను పూర్తి చేయాలని ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటన విడుదల చేసింది. ప్రధాన రాజకీయ పార్టీలు ఇప్పటికే తమ తమ అభ్యర్థులను ప్రకటించాయి. ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు సైతం పోటీ పడుతున్నారు. ఈ ఎన్నికల్లో ఓటు వేయాలంటే.. పట్టభద్రులైన వారు ఓటరుగా నమోదు చేసుకోవాలి.

అర్హతలు... ✪ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ లేదా డిప్లమో పూర్తిచేసి మూడు సంవత్సరాలు అయి ఉండాలి. ✪ 2021, నవంబరు ఒకటో తేదీ లోపు కోర్సు పూర్తవ్వాలి. ✪ ఆధార్ చిరునామా ఉన్న జిల్లాలో ఓటరుగా నమోదు చేసుకోవాలి.

నమోదు.. సులువే

ఆన్‌లైన్‌లో..

ముందుగా ఫొటో, డిగ్రీ/డిప్లమో పట్టాల సాఫ్ట్ కాపీని సిద్ధంగా ఉంచుకోండి. గూగుల్ బ్రౌజర్‌లో https:/// ceoandhra.nic.in లోకి వెళ్లాలి. 'ఎమ్మెల్సీ ఇ రిజిస్ట్రేషన్ 2024' అనే దానిపై క్లిక్ చేస్తే.. 'గ్రాడ్యుయేట్స్ (ఫారం 18)' వస్తుంది. దాన్ని క్లిక్ చేయగా, కొత్త పేజీ ఓపెన్ అవుతుంది. మీ పేరు, ఫోన్ నంబరు, పాస్‌వర్డ్, ఇతర వివరాలతో పాటు 'క్యాప్‌చ' నమోదు చేయాలి. 'కంటిన్యూ' క్లిక్ చేస్తే.. మీ చరవాణికి ఓటీపీ వస్తుంది. దానిని నమోదు చేస్తే మీరు రిజిస్టర్ అయినట్లే. ఆ తర్వాత మీ ఫోన్ నంబరు, మీరు క్రియేట్ చేసుకున్న పాస్‌వర్డ్‌తో లాగిన్ అవ్వాలి. ఫారం 18 ఆన్‌లైన్ దరఖాస్తు వస్తుంది.



గడువు వివరాలు..

ఆఖరి తేదీ : నవంబరు 6
ముసాయిదా జాబితా : నవంబరు 23
అభ్యంతరాల స్వీకరణ : డిసెంబరు 9వరకు
తుది ఓటర్ల జాబితా : డిసెంబరు 30

ఇలా పూర్తి చేయాలి...

జిల్లా పేరు, ఫొటో, మీ పేరు, ఇంటి పేరు, తండ్రి పేరు, పుట్టిన తేదీ, లింగం, విద్యార్హతలు, వృత్తి నమోదు చేయాలి. ఇంటి చిరునామా, ఓటరు కార్డు, ఆధార్, నియోజకవర్గం వివరాలు పూర్తి చేయాలి. డిగ్రీ/డిప్లమో ఏ యూనివర్సిటీలో చదివారో నమోదు చేసి, సదరు పట్టాను అప్‌లోడ్ చేయాలి. చరవాణి నంబరు, మెయిల్ ఐడీ నమోదు చేసి.. సబ్మిట్ చేయాలి. మీ దరఖాస్తు ఎన్నికల సంఘానికి వెళుతుంది. మీ దరఖాస్తుకు ఒక సీరియల్ నంబరు కేటాయిస్తారు. దాని ప్రకారం స్టేటస్ కూడా తెలుసుకోవచ్చు. అధికారుల పరిశీలన అనంతరం.. పట్టభద్రుల ఓటరుగా గుర్తిస్తారు.

గతంలో దరఖాస్తు చేసుకున్నా...

గత పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదు చేసుకున్న వారు సైతం మళ్లీ.. కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిందే. పాత ఓటర్ల జాబితా రద్దవుతుంది. ఎప్పటికప్పుడు కొత్త జాబితాతోనే ఎమ్మెల్సీ ఎన్నికలు నిర్వహిస్తారు. పట్టభద్రులు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలి.

2019 ఎన్నికలకు..

పట్టభద్రుల ఎన్నికల్లో (2019) సుమారు రెండు లక్షల మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,49,319 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. 2025 ఎన్నికలకు 4 లక్షల మందిని ఓటర్లుగా చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

రైల్వేస్టేషన్‌లో భద్రత డొల్ల!

■ బ్లేడ్, గంజాయి బ్యాచ్ హవా
■ భయాందోళనలో ఉద్యోగులు

విజయవాడ, న్యూస్‌టుడే

విజయవాడ రైల్వేస్టేషన్‌తో పాటు రైల్వే యార్డులు గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు అడ్డాగా మారాయి. నిత్యం జనసంచారం ఎక్కువగా ఉండే రైల్వేస్టేషన్ ప్రాంగణంలో ఇటీవల లోకోపైలెట్ హత్య ఉద్యోగుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. గత రెండేళ్లలో రైల్వే ప్రాంగణంలో సుమారు 6 హత్యలు చోటు చేసుకోవడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. రైల్వే పోలీసుల పర్యవేక్షణ అంతంగా మాత్రంగా ఉండడంతో సంఘ విద్రోహ శక్తులు పేట్రేగిపోతున్నాయి. ప్రయాణికులు, రైల్వే సిబ్బందిపై దాడులకు పాల్పడుతూ భయాందళన సృష్టిస్తున్నారు.

☛ రైల్వేస్టేషన్ సమీపంలోని నైజాంగేట్ లెవల్ క్రాసింగ్‌ను పూర్తిగా మూసివేయడంతో ఆ ప్రాంతం గంజాయి, బ్లేడ్ బ్యాచ్‌కు ఆవాసంగా మారింది. రాత్రి వేళ మద్యం, గంజాయి మత్తులో దాడులకు పాల్పడుతూ హత్యలు సైతం చేస్తున్నారు. దీంతో రైల్వే సిబ్బంది విధులకు వెళ్లాలంటే ఆందోళనకు గురవుతున్నారు. రైల్వే లోకోపైలెట్లు, గార్డులు, టీటీఈలు ఇతర రన్నింగ్ సిబ్బంది రాత్రి సమయాల్లో ఎక్కువగా విధులకు వెళ్లాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా తీసుకుంటూ దాడులకు పాల్పడుతున్నారు.

☛ రైల్వేస్టేషన్ సమీపంలోని బొగ్గులైను రైల్వే కాలనీ, ఆర్ఈ కాలనీ, అప్‌యార్డ్ కాలనీ, సత్యనారాయణపురం రైల్వే కాలనీల నుంచి నిత్యం ఉద్యోగుల రాకపోకలు ఎక్కువగా ఉంటాయి.



వేధిస్తున్న పోలీసు సిబ్బంది కొరత..

రైల్వే పరిధిలోని ప్రాంతాల్లో నిఘా భద్రత తమది కాదని స్థానిక పోలీసులు వదిలివేస్తున్నారు. దీంతో ఉద్యోగుల భద్రత సవాలుగా మారుతోంది. విజయవాడ రైల్వే ప్రాంగణాలు సత్యనారాయణపురం, వన్‌టౌన్, కొత్తపేట, అజిత్‌సింగ్‌నగర్ పోలీ స్టేషన్ల పరిధిలో ఉన్నాయి. రైల్వే పరిధిలో జరిగే నేరాలపై జీఆర్పీ పోలీసులు కేసులు నమోదు చేస్తారు. అయితే సిబ్బంది కొరత కేసుల దర్యాప్తుపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రైళ్లు, స్టేషన్లలో దొంగతనాలు, రైల్వే పరిసరాల్లో అనుమానాస్పద మృతి కేసులు, రైళ్లలో ఎస్కార్ట్ డ్యూటీలు నిర్వహించేందుకే వారికి సిబ్బంది సరిపోవడం లేదు. జీఆర్పీ పోలీస్‌స్టేషన్‌లో ప్రస్తుతం సిబ్బంది కొరత అధికంగా ఉంది. సుమారు 100 మంది వరకు సిబ్బంది కావాల్సి ఉంటుంది. కనీసం మూడో వంతు సిబ్బంది కూడా లేకపోవడంతో భద్రతను పూర్తిగా వదిలివేశారు. దక్షిణ మధ్య రైల్వేలోనే అత్యధిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే విజయవాడ రైల్వేస్టేషన్‌లో భద్రతా ఏర్పాట్లు ఎక్కడా సరిగా లేవు.

☛ విజయవాడ రైల్వేస్టేషన్‌లోని రిజర్వేషన్ కార్యాలయంలో రాత్రి సమయాల్లో బ్లేడ్ బ్యాచ్ సభ్యులు నేరుగా వచ్చి ప్రయాణికులను బెదిరించి డబ్బులు, సెల్‌ఫోన్లు లాక్కుంటున్నారు. రాత్రి 12గంటల నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

☛ రైల్వేస్టేషన్ నుంచి డీఆర్ఎం కార్యాలయం మీదగా ఖుద్దూస్‌నగర్ రహదారి రాత్రి సమయాల్లో నిర్మానుష్యంగా ఉంటుంది. ఇక్కడ నిత్యం ఉద్యోగులపై దాడులు జరుగుతుంటాయి. ఇటీవల విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద హత్య కూడా జరిగింది.

☛ నైజాం గేటు, కేదారేశ్వరపేట ఎర్రకట్ట రహదారి, ఫోర్‌మెన్ బంగ్లా, రైల్వే యార్డు, డీజిల్ లోకోషెడ్డు, ఎలక్ట్రిక్ లోకోషెడ్డు, పంజాసెంటర్ వైపు, తారాపేట రైల్వేస్టేషన్ ప్రాంతాల్లో పరిస్థితి దారుణంగా ఉంటుంది. ఇక్కడ రాత్రి సమయాల్లో ప్రజలు తిరగలేని పరిస్థితి ఉంది. పోలీసు నిఘా అసలు ఉండదు.

☛ రైల్వేస్టేషన్ నుంచి రైల్వే ఆసుపత్రి, రైల్వే ఎస్పీ కార్యాలయం, రోడ్డు, నాపరాళ్ల డిపో, రైల్వే ఆర్ఈ కాలనీ రోడ్ ప్రాంతాల్లోనూ బ్లేడ్ బ్యాచ్ సభ్యులు సంచారం ఎక్కువ.

☛ రైల్వే యార్డుతో పాటు నిర్మానుష్య ప్రాంతాల్లో రాత్రి సమయాల్లో భద్రత కట్టుదిట్టం చేయాలి. చీకటిగా ఉన్న ప్రాంతాల్లో ఎక్కువ సంఖ్యలో వీధి దీపాలు, ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేయాలి. గస్తీ పెంచాలి.

దుర్గగుడి హుండీ ఆదాయం రూ.3.50 కోట్లు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే : దసరా ఉత్సవాల్లో శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మల్లికార్జున మహామండపం ఆరో అంతస్తులో బుధవారం లెక్కించారు. 15 రోజుల్లో హుండీల్లో సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.3.50 కోట్ల ఆదాయం వచ్చింది. భక్తులు 272 గ్రాముల బంగారం, 9.325 గ్రాముల వెండి వస్తువులను మొక్కుల రూపంలో చెల్లించుకున్నారు. విదేశీ కరెన్సీ 285 యూఎస్‌ఏ డాలర్లు, 50 కెనడా డాలర్లు, 20 ఇంగ్లాండ్ పౌండ్లు, 5 కువైట్ దీనార్లు, 6 సింగపూర్ డాలర్లు, 15 సౌదీ రియాల్స్, 160 ఆస్ట్రేలియా డాలర్లు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కానుకల్లో అమ్మవారికి సమర్పించేందుకు నోట్ల దండను కూడా మొక్కు రూపంలో చెల్లించుకున్నారు. లెక్కింపును ఈవో రామరావు, డిప్యూటీ ఈవో రత్నంరాజు పర్యవేక్షించారు.



కానుకల లెక్కింపులో వచ్చిన నోట్ల దండను పరిశీలిస్తున్న ఈవో రామారావు



అలరించిన కూచిపూడి నృత్యం

ఇంద్రకీలాద్రిపై ధర్మపథం కార్యక్రమంలో భాగంగా కళావేదికపై బుధవారం ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను అలరించింది. విజయవాడకు చెందిన కళాకారిణులు సుధేష్ణ, గ్రీష్మప్రియ, హారిణి ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకుంది. సిబ్బంది వారికి ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలను అందజేశారు.

20న 'రైతు నేస్తం' పురస్కారాల ప్రదానోత్సవం

కొర్నెపాడు(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలంలోని కొర్నెపాడు, హైదరాబాద్‌లలో ఉన్న 'రైతు నేస్తం' ఫౌండేషన్ 20వ వార్షికోత్సవం సందర్భంగా పద్మశ్రీ ఐవీ సుబ్బారావు స్మారక పురస్కారాల ప్రదానోత్సవాన్ని ఈ నెల 20న నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ఛైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. కృష్ణాజిల్లా గన్నవరంలోని స్వర్ణభారతి ట్రస్ట్ వేదికగా జరిగే ఈ కార్యక్రమంలో మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా పురస్కారాల ప్రదానం ఉంటుందన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల ప్రదర్శన కూడా ఉంటుందని, వ్యవసాయ రంగంలో కృషి చేసిన వారిని గౌరవించుకోవడం ఆనందదాయకమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశిష్ట అతిథిగా హాజరయ్యే ఈ కార్యక్రమంలో ముప్పవరపు ఫౌండేషన్ ఛైర్మన్ ముప్పవరపు హర్షవర్ధన్ పాల్గొంటారని వెంకటేశ్వరరావు వివరించారు.

పీఎం ఇంటర్న్‌షిప్‌కు వేళాయె...

● ఉమ్మడి కృష్ణా విద్యార్థులకు ప్రయోజనం
● ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం

కానూరు, రామవరప్పాడు, న్యూస్‌టుడే





యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా ఇంటర్న్‌షిప్ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఏటా రూ.66 వేలు చొప్పున ఐదేళ్ల పాటు దేశ వ్యాప్తంగా కోటి మంది విద్యార్థులకు ఆర్థిక లబ్ధి చేకూరే విధంగా రూపొందించిన ఈ పథకాన్ని 2024-25లో పైలెట్ ప్రాజెక్టు కింద అమలు చేస్తున్నారు. నెలకు రూ.5వేలు చొప్పున ఏడాదికి 60 వేల ఆర్థిక సాయానికి అదనంగా మరో రూ.6వేలు గ్రాంటు ఇస్తారు. ఇందుకు సంబంధించిన ఈ వెబ్ పోర్టల్ అక్టోబరు 12 నుంచి ప్రారంభించారు. ఈ నెల 25 వరకు అభ్యర్థులు వెబ్‌పోర్టల్‌లో తమ సమాచారంతో దరఖాస్తు చేయవచ్చు. ఈ పథకం వల్ల ఉమ్మడి కృష్ణాలో ఎక్కువ మంది విద్యార్థులు ప్రయోజనం పొందే అవకాశం ఉంది.

ఉమ్మడి కృష్ణా జిల్లాలో విద్యార్థులు (21- 24 వరకు)	
డిగ్రీ పూర్తి చేసినవారు	50,000
ఐటీఐ	15,000
డిప్లొమా	15,000

వికసిత్ భారత్ లక్ష్యం

పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా యువతలో సరైన నైపుణ్యాలు లేవని నిపుణులు, పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని డిగ్రీ చేసిన వారికి తగిన నైపుణ్యాలు అందించడానికి ఈ పథకం రూపకల్పన చేశారు. వికసిత భారత్ లక్ష్యంగా నైపుణ్యాలు అందించే ప్రక్రియలో భాగంగా ఈ ఇంటర్న్‌షిప్ దోహదపడనుంది.

టాప్- 500 సంస్థల్లో ఎంపిక

ఇంటర్న్‌షిప్‌నకు ఎంపికైన అభ్యర్థులను దేశంలోని టాప్- 500 సంస్థల్లో ఎంపిక చేస్తారు. గత 3 ఏడేళ్లలో కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) నిధిలో భాగంగా తమ నికర లాభాల్లో కొంతమేర సమాజసేవ నిమిత్తం సవ్యంగా ఖర్చు చేసిన టాప్- 500 సంస్థలను ఈ పథకం నిమిత్తం కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేసింది.

దరఖాస్తు చేసుకోండిలా..

పీఎంఇంటర్న్‌షిప్ డాట్ఎంసీఏడాట్‌జీవో వీడాట్ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. అక్టోబరు 12 నుంచి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఇది ఈ నెల 25 వరకు కొనసాగుతుంది. 26న షార్టు లిస్టుచేస్తారు. అనంతరం 27 నుంచి నవంబర్ 7 వరకు అభ్యర్థులకు ఇంటర్న్‌షిప్ చేయడానికి సంస్థను కేటాయించనున్నారు. అనంతరం నవంబరులో ఆఫర్ లెటర్లు అందిస్తారు. డిసెంబరులో సంబంధిత సంస్థల్లో కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. ఈ పథకంలో కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్ విధానం అమలు చేస్తుంది.

కావాల్సిన పత్రాలు

దరఖాస్తు చేయడానికి ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, విద్యార్హత పత్రాలు తప్పనిసరిగా ఉండాలి. అభ్యర్థికి గరిష్ఠంగా 3 ఎంపికలు అందిస్తారు. ఎంపికైన వారికి ప్రముఖసాఫ్టువేర్ సంస్థలు, బహుళ జాతి సంస్థలు, గ్యాస్, చమురు, ఇంధనరంగం, టూర్స్ అండ్ ట్రావెల్స్, ఆతిథ్య రంగాల్లో అవకాశాలు ఇస్తారు.

ఎవరు అర్హులంటే?

● 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, పాలిటెక్నిక్, లేదా బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఫార్మా చదివిన అభ్యర్థులు ఈ పథకానికి అర్హులు. విద్యార్థుల వయసు 21- 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎంపికైన వారికి సంవత్సరం ఇంటర్న్‌షిప్ అందిస్తారు. సగం కాలం పరిశ్రమల్లో వాస్తవ పని అనుభవం లేదా ఉద్యోగ వాతావరణంలో గడపాల్సి ఉంటుంది.

వీరు అనర్హులు

● తల్లిదండ్రులు లేదా భార్యా భర్తలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నవారు.
● కుటుంబ వార్షిక ఆదాయం రూ.8 లక్షల కంటే ఎక్కువ ఉన్నవారు.
● పూర్తి సమయం కోర్సులు చదువుతున్న వారు.
● ఐఐటీ, ఐఐఎం, నేషనల్ లా విశ్వవిద్యాలయం, ఎన్ఐటీ, ఐఐఐటీలు, సీఏ, ఎంబీబీఎస్, బీడీఎస్, ఎంబీఏ, సీఎస్, డిగ్రీలు పొందినవారు.
● వృత్తిపరమైన డిగ్రీలు చేసిన వారు.
● ఏదైనా స్కిల్ అప్రెంటీస్‌షిప్ చేసిన వారు.

సివిల్స్ పరీక్షల్లో విద్యార్థులు రాణించాలి

కానూరు, న్యూస్‌టుడే : సివిల్స్ పోటీ పరీక్షల్లో ఈ ప్రాంత విద్యార్థులు ప్రతిభ కనబరిచి విజయం సాధించాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం కానూరు బందరు రోడ్డులో టైమ్ ఆస్పత్రి సమీపంలో ప్రతిభ సివిల్స్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. నగరం ఎడ్యుకేషన్ హబ్‌గా మారుతుందన్నారు. ఇప్పుడు దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా సివిల్స్, ఇతర పోటీ పరీక్షలకు ఇక్కడే నాణ్యమైన కోచింగ్ ఇచ్చే సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఆర్టీసీ ఛైర్మన్ నారాయణ మాట్లాడుతూ.. గత 20 ఏళ్లుగా ఎంతో మందిని ప్రభుత్వ ఉద్యోగులుగా తీర్చిదిద్దిన సుధాకర్ ఇప్పుడు ఈ సివిల్స్ కోచింగ్ సంస్థ ఏర్పాటు చేయడం ఆనందంగా ఉందన్నారు. అకాడమీ డైరెక్టర్ సుధాకర్ మాట్లాడుతూ.. ఇంటర్, డిగ్రీ స్థాయి నుంచే సివిల్స్ కోచింగ్ ద్వారా విద్యార్థులు సులువుగా సివిల్స్‌లో విజయం సాధించవచ్చన్నారు. ప్రొఫెసర్ డి.సూర్య చంద్రరావు వెబ్‌సైట్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అశోక్, డైరెక్టర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ దేవానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిభ సివిల్స్ అకాడమీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి కొల్లు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల, డైరెక్టర్ సుధాకర్ తదితరులు

ఇతర దేవాలయాల లడ్డూలు ఉచిత ప్రసాదానికి వినియోగం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇతర దేవాలయాల నుంచి తీసుకువచ్చిన లడ్డూ ప్రసాదాలను అమ్మవారికి నివేదించి భక్తులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు దుర్గగుడి ఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. దసరా ఉత్సవాల్లో ఉచిత లడ్డూ ప్రసాదాల వితరణను ప్రారంభం నుంచి కొనసాగించినందున విజయదశమి రోజు కొంత మేర ఉచిత లడ్డూ ప్రసాదాల పంపిణీకి ఆటంకం ఏర్పడింది. 13, 14 తేదీల్లో ఉచిత ప్రసాద పంపిణీకి కొరత ప్రభావాన్ని నివారించేందుకు మోపిదేవి, పెదకాకాని, పెనుగంచిప్రోలు దేవస్థానాల నుంచి 37 వేల లడ్డూలను దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్వీకరించామన్నారు. వాటిని ఉచిత ప్రసాదంగా పంపిణీ చేశామని ఈఓ పేర్కొన్నారు. 27,10,225 లడ్డు ప్రసాదాలను దేవస్థానం కౌంటర్లలో విక్రయించినట్లు తెలిపారు. దేవస్థానం పరిధిలోని రెండు పాయింట్ల వద్ద పరిమితికి మించి లడ్డూలను తయారు చేసి భక్తులకు అందించామని ఈవో పేర్కొన్నారు.

కోకో సాగులో సవాళ్లు అధిగమించేందుకు కృషి

పటమట, న్యూస్‌టుడే: సమష్టి కృషితోనే కోకో సాగులో సవాళ్లను అధిగమించి, అధిక దిగుబడులు, మెరుగైన ఆదాయంతో రైతులకు మేలు చేయవచ్చని శాస్త్రవేత్తలు, అధికారులు అన్నారు. కోచి కేంద్రంగా పనిచేస్తున్న డైరెక్టరేట్ ఆఫ్ క్యాష్యూనట్ అండ్ కోకో డెవలప్‌మెంట్, ఆంధ్రప్రదేశ్ ఉద్యాన శాఖ సంయుక్తంగా బుధవారం విజయవాడలోని హోటల్ పార్క్ ఎన్‌లో కోకో పంటపై భాగస్వామ్య పక్షాల సదస్సు నిర్వహించారు. డీసీసీడీ డైరెక్టర్ డాక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యాన శాఖ డైరెక్టర్ డాక్టర్ కె.శ్రీనివాసులుతో పాటు రైతులు, శాస్త్రవేత్తలు, మార్కెటింగ్ ఏజెన్సీలు, ఉద్యాన శాఖ అధికారులు పాల్గొని కోకోకు సంబంధించి విత్తు నుంచి విక్రయం వరకు ఎదురవుతున్న సమస్యలు, అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. నాణ్యమైన మొక్కలు, బీన్స్ ఉత్పత్తి, విలువ జోడింపు, పంట కోత అనంతరం నిర్వహణ, కోకో అభివృద్ధికి సమగ్ర వ్యూహాలు తదితరాలపై మాట్లాడారు. శ్రీనివాసులు మాట్లాడుతూ.. అధిక నాణ్యత గల మొక్కల ఉత్పత్తికి కోకో క్లోనల్ ఆర్చర్డ్ ఏర్పాటు చేసినట్లు వివరించారు. కోకో సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ఉద్యాన శాఖ, డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీతో కలిసి ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. కోకో పంట విస్తరణ, బీన్స్ ఆరబోత, చాక్లెట్ల ఉత్పత్తికి కోకో పౌడర్ ఆధారిత పరిశ్రమల స్థాపనకు ఉద్యాన శాఖ రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ఉద్యానశాఖ అదనపు డైరెక్టర్లు ఎం.వెంకటేశ్వర్లు, బాలాజీ నాయక్, హరినాథ్‌రెడ్డి, సహాయ సంచాలకులు సుధ, తదితరులు పాల్గొన్నారు.



విత్తనాలు పరిశీలిస్తున్న డీసీసీడీ డైరెక్టర్ ఫెమీనా, ఏపీ ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు

నేటి నుంచి దక్షిణ మండల అథ్లెటిక్స్

ఎ.ఎన్.యు: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు సౌత్‌జోన్ అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించనున్నారు. ఏపీ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏఎన్‌యూలోని సింథటిక్ మైదానంలో నిర్వహించే ఈ పోటీల్లో ఆరు రాష్ట్రాలు, ఒక కేంద్ర ప్రాంతానికి చెందిన 848 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు.

ముంబయి పోలీసుల పేరుతో టోకరా

అరెస్టు చేస్తామని రూ.23.8 లక్షల వసూలు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే : ఓ నేరస్థుడు మీ బ్యాంకు ఖాతాలోకి రూ.30 లక్షలు పంపాడని, మిమ్మల్ని అరెస్టు చేస్తామని సైబర్ నేరగాళ్లు బెదిరించి ఓ వృద్ధుడి నుంచి రూ.23.80 లక్షలు వసూలు చేశారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ నగర శివారు రామవరప్పాడుకు చెందిన ఓ వృద్ధుడు (80) ప్రభుత్వ ఉద్యోగం చేసి, రిటైరయ్యారు. ఆయనకు గత నెల 9వ తేదీన గుర్తు తెలియని నంబరు నుంచి ఫోన్ వచ్చింది. తాను ముంబయి టెలికం డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నానని అవతలి వ్యక్తి చెప్పాడు. ముంబయి డౌన్‌గ్రివాలా పోలీస్‌స్టేషన్ ఎస్సైతో కాన్ఫరెన్స్ కలిపాడు. మరో వ్యక్తి తాను ఎస్సైగా పరిచయం చేసుకున్నాడు. రాజ్‌కుంద్రా అనే వ్యక్తి.. మీ పేరుతో కెనరా బ్యాంకులో ఖాతా తెరిచాడని చెప్పాడు. ఆ ఖాతాకు రూ.30 లక్షలు పంపినట్లు తమ దర్యాప్తులో చెప్పాడని, దీనిపై విచారించాలంటూ వృద్ధుడిని భయపెట్టాడు. అరెస్టు చేస్తామని.. దీన్ని తప్పించుకోవాలంటే రూ.30లక్షలు చెల్లించాలని డిమాండ్ చేశాడు. భయపడిపోయిన వృద్ధుడు.. వారి మాటలు నమ్మి విడతల వారీగా నాలుగు బ్యాంకు ఖాతాలకు రూ.23.80 లక్షలు పంపించారు. ఆ తర్వాత మోసపోయినట్లు గుర్తించి మంగళవారం సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు.

రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు జిల్లా జట్లు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: స్థానిక కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లా అండర్-17 బాలబాలికల వాలీబాల్ జట్లను ఎంపిక చేశామని జిల్లా స్కూల్ గేమ్స్ సమాఖ్య కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు (ఎన్టీఆర్), డి.శ్రీనివాసరావు (కృష్ణా) తెలిపారు. ఎంపిక పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలోని సుమారు వంద మంది క్రీడాకారులు తలపడ్డారని పేర్కొన్నారు. వారిలో ప్రతిభగల క్రీడాకారులను ఎంపిక చేశామన్నారు. వారంతా ఈ నెల 21 నుంచి శ్రీసత్యసాయి జిల్లా హిందూపూర్ మండలం ముదిరెడ్డిపాడు జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడుతారని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులను ప్రధానోపాధ్యాయిని జి.ఎస్తేర్‌రాణి, స్కూల్ ఎస్ఏ పీఈ ఎల్.దుర్గారావు, పీఈటీ సింహాద్రి రమేష్, ఎస్‌జీఎఫ్ సంయుక్త కార్యదర్శి చంద్రశేఖర్ అభినందించారు.



బాలబాలికల జట్లతో ఎస్తేర్‌రాణి, దుర్గారావు, రమేష్, శ్రీనివాసరావు తదితరులు

బాలికల జట్టు: పి.అమృత, ఆర్.మేధాశ్రీ, ఎం.రిషిక, సీహెచ్ తన్విశ్రీ, డి.వెన్నెల, కె.మైనశ్రీ, ఎం.మధుర మీనాక్షి, పి.వాగ్దేవి, ఎం.తన్విక లక్షనాగశ్రీ, సీహెచ్ స్వప్నకుమారి, ఎల్.కీర్తన, కె.స్నేహలత, స్టాండ్‌బైగా పి.మౌనిక, సీహెచ్ యసస్వి, ఎస్.చరిష్మా, ఎన్.హర్షవర్ధని, ఎం.భాగ్యలక్ష్మి, ఎం.అనన్య.

బాలుర జట్టు: పి.సాయి చరణ్, బి.బాల వెంకటేష్, ఎల్.సిద్ధూ, పి.చైతన్యకుమార్, కె.ఆకాష్, ఎన్.జయవర్ధన్, జె.భవానీప్రసాద్, ఎస్‌కే ఇర్ఫాన్, బి.నందకిషోర్, ఆర్.ప్రజ్వల్, వి.నివాస్, బి.సందీప్, స్టాండ్ బైగా ఎం.మనోజ్, కె.రవికుమార్, బి.సంతోష్, ఎం.అరవింద్, పి.ప్రదీప్, వి.యుగేంద్రవర్మ.